శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; ఉత్తరాయణం;
వసంత రుతువు, చైత్ర మాసం, బహుళపక్షం షష్ఠి:
మ. 1-55 తదుపరి సప్తమి మూల: ఉ. 6-37
తదుపరి పూర్వాషాఢ వర్జ్యం: ఉ. 6-37 వరకు
తిరిగి సా. 4-37 నుంచి 6-17 వరకు అమృత
ఘడియలు: రా. 12-56 నుంచి 2-36 వరకు
దుర్ముహూర్తం: ఉ. 5-46 నుంచి 7-25 వరకు
రాహుకాలం: ఉ. 9-00 నుంచి 10-30 వరకు
సూర్యోదయం: ఉ.5.46;
సూర్యాస్తమయం: సా.6.12

# సిటీ టైమ్స్

తెలుగు దినపత్రిక

**టీజీ ఈఏపీసెట్..**

## 22 నుంచి ఇంజినీరింగ్ హాల్‌టికెట్లు



**హైదరాబాద్:** ఈ నెల 29 నుంచి మే 4 వరకు తెలంగాణ ఈఏపీసెట్ పరీక్షలు నిర్వహించనున్నారు. ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్షకు అనుమతించబోమని ఉన్నత విద్యామండలి అధికారులు తెలిపారు. ఈఏపీసెట్ ఏర్పాట్లకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. "ఈనెల 29, 30 తేదీల్లో అగ్రికల్చర్, ఫార్మా ప్రవేశ పరీక్ష జరుగుతుంది. మే 2 నుంచి 4 వరకు ఇంజినీరింగ్ పరీక్ష నిర్వహిస్తాం. 2

శనివారం - 19 - ఏప్రిల్ 2025 | సంపుటి : 25 సంచిక : 293 | పేజీలు - 8 వెల : రూ 3 | www. citytimes news.com

# తమిళనాడులో అమిత్ షా రూల్ చెల్లదు...

### స్టాలిన్ ఘాటు వ్యాఖ్యలు
### 'అమిత్ షానే కాదు.. ఏ షా వచ్చినా మాకేం కాదు.. అది డీఎంకే పవర్'



**చెన్నై,(సిటీ టైమ్స్):**
ఇటీవల అన్నా డీఎంకేతో బీజేపీ పొత్తు పెట్టుకున్న తర్వాత డీఎంకే పార్టీ తీవ్రంగా స్పందిస్తోంది. గత వారం అదొక 'అవినీతి కూటమి' అంటూ వ్యాఖ్యానించిన డీఎంకే అధ్యక్షుడు, తమిళనాడు సీఎం స్టాలిన్.. వారి పొత్తుపై మరొకసారి ఘాటు వ్యాఖ్యలు చేశారు. తమిళనాడుకొచ్చి బీజేపీ ఏదో చేద్దామని కలలు కంటుందని, అది వారి వల్ల కాదని స్టాలిన్ నేరుగా విమర్శలు చేశారు. తమిళనాడుకు అమిత్ షానే కాదు.. ఏ షా వచ్చినా తమకేమీ కాదంటూ విమర్శించారు. అన్నా డీఎంకేతో (మిగతా 2 లో)



## కంచ గచ్చిబౌలి భూములపై వెంటనే విచారణ చేపట్టాలి

### ప్రధాని మోదీకి కేటీఆర్ విజ్ఞప్తి

**హైదరాబాద్,(సిటీ టైమ్స్):**
ప్రధాని నరేంద్రమోదీకి భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ కీలక విజ్ఞప్తి చేశారు. కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంపై చర్చ జరుగుతున్న నేపథ్యంలో ప్రధానిగా పర్యావరణంపై చిత్తశుద్ధిని నిరూపించుకోవాల్సిన సమయమిదన్నారు. ఈ మేరకు 'ఎక్స్' ద్వారా ప్రధానిని (మిగతా 2 లో)

## 'బంగ్లాదేశ్ తిరుగుబాటుతో తెలంగాణకు సంబంధమేంటి?'

### కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి

**హైదరాబాద్,(సిటీ టైమ్స్):**
తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కు అక్కసు ఎందుకని ప్రశ్నించారు కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి. పదేళ్లలో బీఆర్ఎస్ చేయనటువంటి పనులను సీఎం రేవంత్ రెడ్డి చేస్తున్నారని మల్లు రవి స్పష్టం చేశారు. 'తెలంగాణలో ప్రజల తిరుగుబాటుతోనే బిఆర్ఎస్ ప్రభుత్వం కూలిపోయింది. పదేళ్ల పాలనలో బంగారు తెలంగాణ కాస్తా బంగారు (మిగతా 2 లో)






# తెలంగాణకు భారీ పెట్టుబడులు

## రూ.10,500 కోట్లతో హైదరాబాద్‌లో ఏఐ డేటా సెంటర్ క్లస్టర్ ఏర్పాటు

### ఎన్‌టీటీ డేటా, నెయిసా సంయుక్తంగా రూ.10,500 కోట్ల పెట్టుబడులు
### హైదరాబాద్‌లో నిర్మించబోయే 400 మెగావాట్ల డేటా సెంటర్ క్లస్టర్..
### దేశంలో తెలంగాణను అర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రాజధానిగా మార్చాలనే లక్ష్యం
### ఈ భారీ పెట్టుబడుల ఒప్పందంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆనందం వ్యక్తం



**హైదరాబాద్,(సిటీ టైమ్స్):**
తెలంగాణలో భారీ పెట్టుబడులకు ఒప్పందం కుదిరింది. హైదరాబాద్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ డేటా సెంటర్ క్లస్టర్ ఏర్పాటుకు ఒప్పందం చేసుకున్నారు. ఎన్‌టీటీ డేటా, నెయిసా సంయుక్తంగా రూ.10,500 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నాయి. హైదరాబాద్‌లో నిర్మించబోయే 400 మెగావాట్ల డేటా సెంటర్ క్లస్టర్.. 25,000 జీపీయూలతో దేశంలోనే అత్యంత శక్తివంతమైన ఏఐ సూపర్ కంప్యూటింగ్ మౌలిక సదుపాయాలను సమకూర్చనుంది. దేశంలో తెలంగాణను అర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రాజధానిగా మార్చాలనే లక్ష్యానికి అనుగుణంగా ఈ ప్రాజెక్టు రూపుదిద్దుకోనున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు 500 మెగావాట్ల (మిగతా 2 లో)

## హైదరాబాద్ ఎమ్మెల్సీ ఎన్నికలో కాంగ్రెస్, భారాస ఎందుకు పోటీ చేయడం లేదు?

### కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి డిమాండ్



**హైదరాబాద్,(సిటీ టైమ్స్):**
హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలో కాంగ్రెస్, భారాస ఎందుకు పోటీ చేయడం లేదో ప్రజలకు జవాబివ్వాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు. బేగంపేటలో ఎమ్మెల్సీ ఎన్నికపై నిర్వహించిన భాజపా సన్నాహక భేటీలో ఆయన మాట్లాడారు. మజ్లిస్‌కు వ్యతిరేకంగా భాజపా పోరాటం చేస్తోందన్నారు. తమ పార్టీని ఓడించే ఏకైక లక్ష్యంతో కాంగ్రెస్, భారాస పనిచేస్తున్నాయని విమర్శించారు. భాజపాను విమర్శించే నైతిక హక్కు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీకి లేదన్నారు. (మిగతా 2 లో)

## 'భూ భారతి' రెవెన్యూ సదస్సులో తెలంగాణ మంత్రులు

### గతంలో ధరణి పేరిట ఇష్టానుసారం రిజిస్ట్రేషన్లు
### మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కొండా సురేఖ, సీతక్క వ్యాఖ్య

**వెంకటాపూర్,(సిటీ టైమ్స్):**
గతంలో ధరణి పేరిట ఇష్టానుసారం రిజిస్ట్రేషన్లు చేశారని తెలంగాణ మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కొండా సురేఖ, సీతక్క అన్నారు. ములుగు జిల్లా వెంకటాపూర్‌లో నిర్వహించిన 'భూ భారతి' రెవెన్యూ సదస్సులో వారు మాట్లాడారు. రైతులను మోసం చేయడమే లక్ష్యంగా గతంలో 'ధరణి' తీసుకువచ్చారని ఆరోపించారు. ఎన్నికల ముందు ధరణిని బంగాళాఖాతంలో వేస్తామని చెప్పామని.. అలానే చేశామన్నారు. "రైతులు కోల్పోయిన భూములు వారికే చెందాలనే లక్ష్యంతో కొత్త చట్టం తెచ్చాం. గతంలో ధరణి ద్వారా ఏ ఒక్కరికీ న్యాయం జరగలేదు. భూ భారతి చట్టాన్ని దళారులు భ్రష్టు పట్టించే ప్రయత్నం చేస్తారు. ప్రభుత్వం చట్టం చేస్తుందే తప్ప.. అమలు బాధ్యత అధికారులదే. రైతులను ఇబ్బంది పెట్టకుండా అధికారులు సేవలందించాలి. అన్నదాతలు, ప్రజలు ఇందిరమ్మ రాజ్యాన్ని తిరిగి తెచ్చుకున్నారు. పేదల కన్నీటిని తుడిచేందుకు భూ భారతిని తీసుకువచ్చాం. గతంలో ధరణి గురించి రెవెన్యూ సదస్సు ఎక్కడైనా పెట్టారా? చేసిన తప్పులను గత పాలకులు ఇప్పటికీ గ్రహించట్లేదు. ధరణి చట్టంలో సాదా బైనామాల అంశాన్ని ఎత్తేశారు. భూ సమస్యలకు సంబంధించి 9.24 లక్షల దరఖాస్తులు వచ్చాయి. ప్రజల న్యాయమైన సమస్యలు కచ్చితంగా పరిష్కరిస్తాం" అని మంత్రులు తెలిపారు.



# హైదరాబాద్‌లో కుండపోత వర్షం

### భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయం
### తెలుగు తల్లి ఫ్లై ఓవర్ వద్ద రోడ్డుపై కూలిపోయిన చెట్టు
### తెలంగాణలో భిన్న వాతావరణ పరిస్థితులు
### ఉదయం ఎండలు, సాయంత్రానికి వర్షాలు..





**హైదరాబాద్,(సిటీ టైమ్స్):**
నగరంలో భారీ వర్షం కురిసింది బంజారాహిల్స్, జూబ్లిహిల్స్, అమీర్‌పేట్, పంజాగుట్ట, ఖైరతాబాద్, ఎస్ఆర్ నగర్, మాదాపూర్, ఫిలింనగర్, గచ్చిబౌలి, అత్తాపూర్, నార్సింగి, కోకాపేట్, కోఠి, నాంపల్లి, అబిడ్స్ దిల్‌సుఖ్‌నగర్, రాజేంద్ర నగర్, అంబర్‌పేట్, ఉప్పల్, సికింద్రాబాద్, కాచిగూడ, నారాయణగూడ, చిక్కడపల్లి, హయత్‌నగర్, వనస్థలిపురం, ఎల్‌బీనగర్ ప్రాంతాల్లో దంచికొట్టింది. పలు ప్రాంతాల్లో భారీ ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. తెలుగు తల్లి ఫ్లై ఓవర్ వద్ద రోడ్డుపై చెట్టు కూలిపోయింది. లంగర్‌హౌస్‌లో విద్యుత్ తీగలపై భారీ వృక్షం పడింది. నాంపల్లి రెడ్‌హిల్స్‌లోని (మిగతా 2 లో)

## ఛత్తీస్‌గఢ్‌లో లొంగిపోయిన 22 మంది మావోయిస్టులు



**సుక్మా జిల్లా,(సిటీ టైమ్స్):**
ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లాలో శుక్రవారం 22 మంది మావోయిస్టులు భద్రతా దళాల ముందు లొంగిపోయారు. వారిలో 12 మందిపై రూ.40 లక్షల రివార్డు ఉందని పోలీసులు తెలిపారు. అమానవీయ మావోయిస్టు భావజాలం, (మిగతా 2 లో)

## రాజాసింగ్‌కు మళ్లీ కోపమొచ్చింది..!

తనకు పార్టీ నేతలు బర్త్ డే విషెస్ చెప్పలేదని రాజాసింగ్ అలక
బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి అధ్యక్షతన హరిత ప్లాజాలో జరిగిన సమావేశానికి రాజాసింగ్ డుమ్మా



2



## ఈపీఎఫ్ఓ 3.0 వచ్చేస్తోంది..

### ఈపీఎఫ్ఓలో చాలా వరకు మార్పులు చోటు
### కీలక వివరాలు వెల్లడించిన కేంద్రమంత్రి మంత్రి మన్‌సుఖ్ మాండవీయ

**ఢిల్లీ,(సిటీ టైమ్స్):** ఉద్యోగుల భవిష్య నిధి సంస్థలో డిజిటల్‌గా కీలక మార్పులు చోటు చేసుకోబోతున్నాయని కేంద్ర కార్మిక శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ తెలిపారు. ఈపీఎఫ్ఓ 3.0తో 9 కోట్ల మంది చందాదారులకు ప్రయోజనం చేకూరనుందని వివరించారు. మే లేదా జూన్‌కల్లా కొత్త వెర్షన్ అందుబాటులోకి (మిగతా 2 లో)

## రాజాసింగ్‌కు మళ్లీ కోపమొచ్చింది..!



**హైదరాబాద్:** బీజేపీ గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్‌కు మళ్లీ కోపమొచ్చింది. ఈసారి తనకు పార్టీ నేతలు బర్త్ డే విషెస్ చెప్పలేదని రాజాసింగ్ కు అలకబూనారట. రాజాసింగ్‌కు సీఎం రేవంత్ రెడ్డి బర్త్ డే విషెస్ చెప్పగా, బీజేపీ నుంచి ముఖ్య నేతల ఎవరూ కూడా ఆయనకు విషెస్ చెప్పలేదట. దాంతో రాజాసింగ్ మళ్లీ పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే శుక్రవారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి అధ్యక్షతన హరిత ప్లాజాలో జరిగిన సమావేశానికి రాజాసింగ్ డుమ్మా కొట్టారట. ఈటెల రాజేందర్‌తో సహా పలువురు ప్రముఖ నేతలు ఆ మీటింగ్ కు హాజరు కాగా, రాజాసింగ్ మాత్రం అందుకు దూరంగా ఉన్నారు. అందులోనూ హైదరాబాద్ లోకల్ బాడీ ఎమ్మెల్సీ ఎన్నికపై సమావేశం నిర్వహించిన సమయంలో రాజాసింగ్ ఇలా దూరంగా ఉండటం చర్చనీయాంశంగా మారింది. కేవలం ఆయనకు బర్త్ డే విషెస్ చెప్పలేదనే కారణమా?.. లేక ఇంకేమైనా ఉందా? అనే కోణంలో చర్చ నడుస్తోంది.

**బండి సంజయ్ రాజీ చేశారు.. కానీ**

కొద్ది రోజుల క్రితం హైదరాబాద్ లోకల్ బాడీ ఎమ్మెల్సీ అభ్యర్థికి సంబంధించి అలక పాన్పు ఎక్కిన రాజాసింగ్‌ను ఇటీవల ఎంపీ బండి సంజయ్ స్వయంగా కలిసి ఆయనకు నచ్చజెప్పి వచ్చారు. ప్రధానంగ బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి గౌతంరావు అభ్యర్థిత్వాన్ని రాజాసింగ్ తీవ్రంగా వ్యతిరేకించిన క్రమంలో బండి సంజయ్ స్వయంగా రంగంలోకి దిగారు. గౌతంరావును ఆ స్థానంలో నిలబెట్టడానికి ప్రధాన కారణం బండి సంజయ్ కాబట్టి.. రాజాసింగ్ ను బుజ్జగించి వచ్చారు. అప్పుడు గౌతంరావుతో రాజాసింగ్ ను కరాచలనం చేయించడమే కాకుండా ఇరువురు నేతలు శాలువాలతో సత్కరించుకునే కార్యక్రమం కూడా జరిగింది. ఇంతలోనే రాజాసింగ్ మళ్లీ పార్టీ శ్రేణులపై కోపంగా ఉన్నారంటూ పెద్ద ఎత్తును ప్రచారం జరుగుతోంది ఇందుకు తన బర్త్ డేకు పార్టీలోని ప్రముఖులు విషెస్ చెప్పకపోవడంగా సమాచారం. సీఎం రేవంత్ విషెస్ చెప్పగా, తమ సొంత పార్టీలోని ముఖ్యులు ఎవరూ కూడా కనీసం శుభాకాంక్షలు కూడా చెప్పలేదనే కారణంతో రాజాసింగ్ కోపంగా ఉన్నారట, నేటి బీజేపీ కీలక సమావేశానికి రాజాసింగ్ దూరంగా ఉండటానికి ఇదే కారణమనే వాదన ప్రముఖంగా వినిపిస్తోంది.



## ఈపీఎఫ్ఓ 3.0 వచ్చేస్తోంది..

(మొదటి పేజీ తరువాయి)

వస్తుందన్నారు. ఈ మేరకు ప్రముఖ వార్తా సంస్థ 'పీటీఐ'కిచ్చిన ఇంటర్వ్యూలో కీలక విషయాలు పంచుకున్నారు. ఈపీఎఫ్ఓ వెర్షన్ 3.0తో సేవలు మరింత సులభతరం కానున్నాయనని చెప్పారు. ఆటో క్లెయిమ్ సెటిల్‌మెంట్లు, డిజిటల్ కరెక్షన్లు, ఏటీఎం ద్వారా విత్‌డ్రా వంటి సదుపాయాలు అందుబాటులోకి రానున్నాయని తెలిపారు. ఈపీఎఫ్ఓను మరింత సౌకర్యంగా, సమర్థంగా తీర్చిదిద్దడమే ఈ మార్పుల వెనుక ముఖ్య ఉద్దేశమని వివరించారు. క్లెయిమ్‌లు, కరెక్షన్ల కోసం ఫారాలు నింపడం, కార్యాలయాల చుట్టూ తిరగడం వంటి ఇబ్బందులు ఈ కొత్త వెర్షన్‌తో తొలగబోతున్నాయని మాండవీయ తెలిపారు. వేగవంతమైన సెటిల్‌మెంట్ల వల్ల డబ్బులు వారి వారి బ్యాంక్ ఖాతాల్లో త్వరగా జమ అవుతాయని పేర్కొన్నారు. ప్రస్తుతం 27 లక్షల కోట్ల విలువైన నగదు నిల్వలను ఈపీఎఫ్ఓ కలిగి ఉందని, ఈ మొత్తానికి ప్రభుత్వ హామీతో పాటు 8.25 శాతం వడ్డీని అందిస్తోందని చెప్పారు. సెంట్రలైజ్డ్ పెన్షన్ పేమెంట్ సిస్టమ్ వల్ల ఇప్పటికే దేశంలోని ఏ బ్యాంక్ నుంచైనా పెన్షన్ పొందే వెసులుబాటు కల్పించామని, దీనివల్ల 78 లక్షల మందికి ప్రయోజనం కలుగుతోందని వివరించారు. అటల్ పెన్షన్ యోజన, ప్రధాన మంత్రి జీవన్ బీమా యోజన, శ్రామిక్ జన్‌ధన్ యోజన వంటి పెన్షన్ పథకాలన్నింటినీ ఏకీకృతం చేసి పెన్షన్ కవరేజీని క్రమబద్ధీకరించడం, బలోపేతం చేసే అంశాన్ని కేంద్రం పరిశీలిస్తోందన్నారు.



## ఛత్తీస్‌గఢ్‌లో లొంగిపోయిన 22 మంది మావోయిస్టులు

(మొదటి పేజీ తరువాయి)

స్థానిక గిరిజనులపై జరిగిన దురాగతాలతో నిరాశ చెందామని పేర్కొంటూ తొమ్మిది మంది మహిళలు సహా 13 మంది మావోయిస్టులు సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్సెస్ (సీఆర్‌పీఎఫ్) సీనియర్ అధికారుల ముందు లొంగిపోయారని సుక్మా పోలీసు సూపరింటెండెంట్ కిరణ్ చవాన్ తెలిపారు. వీరంతా పలు హింసాత్మక, విధ్వంసకర సంఘటనల్లో పాల్గొన్నారని పోలీసులు చెప్పారు. లొంగిపోయిన వారిలో మావోయిస్టు మిలిటరీ డిప్యూటీ కమాండర్ ముచాకి జోగా, స్క్వాడ్ సభ్యురాలు.. అతని భార్య ముచాకి జోగి ఉన్నారని, వీరిపై రూ.8 లక్షల రివార్డు ఉండగా.. మావోయిస్టుల ఏరియా కమిటీ సభ్యులు దేవే, దుధి బుధ్రాలపై ఒక్కొక్కరిపై రూ.5 లక్షల రివార్డు ఉందన్నారు. మరో ఏడుగురు కార్యకర్తలపై రూ.2 లక్షల రివార్డు, ఒకరిపై రూ.50వేలు రివార్డు ఉన్నట్లు తెలిపారు. వీరందరికీ ఒక్కొక్కరికి రూ.50,000 సాయం అందించామని.. ప్రభుత్వ పునరావాస పథకాన్ని వర్తింపజేస్తామని చెప్పారు. గతేడాది సుక్మాతో సహా బస్తర్ ప్రాంతంలో దాదాపు 792 మంది మావోయిస్టులు లొంగిపోయారని పేర్కొన్నారు.

**వచ్చే మార్చి నాటికి నక్సలిజం అంతం**

వచ్చే ఏడాది మార్చి 31 నాటికి పూర్తిగా తుడిచిపెడతామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా గురువారం పునరుద్ఘాటించిన నేపథ్యంలో మావోయిస్టుల లొంగుబాటు ప్రాధాన్యం సంతరించుకుంది. మధ్యప్రదేశ్‌లో నిర్వహించిన సీఆర్పీఎఫ్ 86వ వ్యవస్థాపక దినోత్సవాల పరేడ్‌లో షా మాట్లాడుతూ.. మావోయిస్టులు లేని భారత్ దిశగా తమ ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు. మావోయిస్టుల ఏరివేత మిషన్‌కు సెంట్రల్ రిజర్వు పోలీస్ ఫోర్స్ (సీఆర్పీఎఫ్) వెన్నెముకగా నిలిచిందని ప్రశంసించారు. ఫలితంగా ఆ ప్రాంతాల్లో మావోయిస్టుల హింసాత్మక ఘటనలు 70శాతానికి పైగా తగ్గి ఇప్పుడు ముగింపు దశకు చేరాయన్నారు. జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాద కార్యకలాపాలను అరికట్టడం కోసం ప్రత్యేక కోబ్రా దళాన్ని ఏర్పాటు చేశామన్నారు.

## టీజీ ఈఏపీసెట్..
## 22 నుంచి ఇంజినీరింగ్ హాల్‌టికెట్లు

(మొదటి పేజీ తరువాయి)

రోజూ రెండు సెషన్లలో ఇవి జరుగుతాయి. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు, మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 వరకు పరీక్షలు నిర్వహిస్తాం. రాష్ట్రవ్యాప్తంగా 16 ప్రాంతాల్లోని 124 కేంద్రాల్లో దీనికోసం ఏర్పాట్లు చేస్తున్నాం. ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్షకు 2,19,420 మంది.. అగ్రికల్చర్, ఫార్మా ప్రవేశ పరీక్షకు 86,101 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. అగ్రికల్చర్, ఫార్మా విద్యార్థులు రేపటి నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఈనెల 22 నుంచి ఇంజినీరింగ్ విభాగం హాల్‌టికెట్ల డౌన్‌లోడ్‌కు అవకాశం కల్పిస్తున్నాం'' అని తెలిపారు.

# తెలంగాణకు భారీ పెట్టుబడులు

(మొదటి పేజీ తరువాయి)

వరకు గ్రిడ్, పునరుత్పాదక విద్యుత్తు మిశ్రమంతో ఈ క్లస్టర్ నిర్వహిస్తారు. లిక్విడ్ ఇమ్మర్షన్ వంటి అత్యాధునిక కూలింగ్ టెక్నాలజీలను అవలంబిస్తారు. ఈ ప్రాజెక్ట్‌ను అత్యున్నత ఈఎస్‌జీ (ఎన్విరాన్‌మెంటల్, సోషల్, గవర్నెన్స్) ప్రమాణాలతో అభివృద్ధి చేస్తారు. ఈ క్యాంపస్ తెలంగాణలోని విద్యా సంస్థల భాగస్వామ్యంతో ఏఐ ప్రతిభను పెంపొందిస్తుంది. రాష్ట్ర డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మిషన్‌కు దోహదం చేస్తుంది. ఈ భారీ పెట్టుబడుల ఒప్పందంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆనందం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పారిశ్రామిక విధానాలు పెట్టుబడులను ఆకర్షిస్తున్నాయని సీఎం రేవంత్ అన్నారు. నమ్మకమైన, నాణ్యమైన విద్యుత్ సరఫరా, సింగిల్ విండో అనుమతులను ప్రభుత్వం అందిస్తుందన్నారు. వీటితో పాటు రాష్ట్రంలో ప్రతిభావంతులైన నిపుణులు అందుబాటులో ఉండటంతో ఏఐ సంబంధిత డిజిటల్ సేవల్లో రాష్ట్రం అగ్రగామిగా నిలుస్తుందన్నారు. ఎడబ్ల్యూఎస్, ఎన్‌టీటీ, టిల్‌మన్ హోల్డింగ్స్, సీటీఆర్ఎల్ఎస్ వంటి పెద్ద కంపెనీల డేటా సెంటర్ ప్రాజెక్టుల వరుసలో ఎన్‌టీటీ భారీ పెట్టుబడుల ఒప్పందంతో దేశంలో ప్రముఖ డేటా సెంటర్ హబ్ గా హైదరాబాద్ స్థానం మరింత బలపడిందన్నారు. కాగా, టోక్యోలో ప్రధాన కార్యాలయం కలిగిన ఎన్‌టీటీ డేటా, ఐటీ సేవలు, డేటా సెంటర్లు, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్‌లో పేరొందిన కంపెనీ. 50 కంటే ఎక్కువ దేశాల్లో 193,000 మంది ఉద్యోగులతో, ప్రపంచంలోని టాప్ 3 డేటా సెంటర్ ప్రొవైడర్లలో



ఈ కంపెనీ ఒకటి. పబ్లిక్ సర్వీసెస్, బీఎఫ్ఎస్ఐ, హెల్త్‌కేర్, మాన్యుఫాక్చరింగ్, టెలికాం వంటి రంగాలకు ఈ సంస్థ సేవలు అందిస్తోంది. నెయిసా నెట్ వర్క్ ఏఐఫస్ట్ క్లౌడ్ ప్లాట్‌ఫాం సంస్థ, నిర్దిష్ట ఏఐ కంప్యూటర్ సొల్యూషన్స్ అందించటంపై ఈ కంపెనీ దృష్టి సారిస్తుంది.

## హైదరాబాద్ ఎమ్మెల్సీ ఎన్నికలో కాంగ్రెస్, భారాస ఎందుకు పోటీ చేయడం లేదు?

(మొదటి పేజీ తరువాయి)

కాంగ్రెస్, భారాస.. మజ్లిస్ కనుసన్నల్లో ఉన్నాయని మండిపడ్డారు. ''రాష్ట్రంలో పార్టీ అధికారంలో ఉన్నా హైదరాబాద్ ఎమ్మెల్సీ ఎన్నికలో ఎందుకు పోటీ చేయడం లేదో రాహుల్ గాంధీ చెప్పాలి. లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసిన భారాస.. ఇప్పుడు ఎందుకు బరిలో దిగడం లేదు? మూడు కుటుంబ పార్టీలు కుమ్మక్కై భాజపాను ఓడించాలని చూస్తున్నాయి. రియల్ ఎస్టేట్ వ్యాపారం ఉన్నచోటే భారాస ప్రభుత్వం అభివృద్ధి చేసింది. తెలంగాణలో డబుల్ ఇంజన్ సర్కార్ వస్తేనే ఈ నగరం అభివృద్ధి చెందుతుంది. మోదీ చేస్తున్న కృషి వల్లే ఇక్కడికి పరిశ్రమలు వస్తున్నాయి. హైదరాబాద్ అంటే హైటెక్ సిటీ ఒక్కటే కాదు.. అంబర్ పేట, ఖైరతాబాద్, నాంపల్లి కూడా నగరంలో భాగమే. కాంగ్రెస్ పార్టీ పట్ల ఎలా ఉండా



లనేదానిపై కేటీఆర్ సర్టిఫికెట్ భాజపాకు అవసరం లేదు'' అని కిషన్‌రెడ్డి తెలిపారు.

## 'బంగ్లాదేశ్ తిరుగుబాటుతో తెలంగాణకు సంబంధమేంటి?'

(మొదటి పేజీ తరువాయి)

కేసీఆర్ కుటుంబంగా మారింది. ప్రతిపక్షాలు రాత్రింబవళ్ళు కాంగ్రెస్ ప్రభుత్వంపై దుష్ప్రచారం చేయడమే పనిగా పెట్టుకున్నాయి. బంగ్లాదేశ్ లో ప్రజలు తిరిగి పడినట్లు కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలు తిరగబడతారని కేటీఆర్ వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటు. పదేళ్లలో బిఆర్ఎస్ చేయనటువంటి పనులను సీఎం రేవంత్ రెడ్డి చేస్తున్నారు. దేశ చరిత్రలో మొదటిసారిగా పేదల కోసం సన్న బియ్యం పంపిణీని ప్రభుత్వం తీసుకొచ్చింది. సన్నబియ్యం పంపిణీ విప్లవాత్మక నిర్ణయం. బంగ్లాదేశ్ తిరుగుబాటుతో తెలంగాణకి ఏం సంబంధం కేటీఆర్. ధరణితో బిఆర్ఎస్ ప్రభుత్వం రైతులను అనేక ఇబ్బందులకు గురి చేసింది. 16 లక్షలు మంది ఇప్పటికి కూడా ఇబ్బంది పడుతున్నారు. రైతుల మేలు కోసం భూభారతిని సీఎం రేవంత్, మంత్రుల



బృందం తీసుకొచ్చింది. ప్రగతి భవన్ లో ప్రజలు కనపడకుండా రక్షణ వలయాన్ని ఏర్పాటు చేశారు. రేవంత్ హయంలో ప్రగతి భవన్ గేట్లు బద్దలు కొట్టి ప్రజలు వెళ్లేందుకు వీలు కల్పించారు. కాంగ్రెస్ ఏడాదిన్నర లో 60 వేలకు పైగా ఉద్యోగాలు ఇచ్చాం' అని మల్లు రవి పేర్కొన్నారు.



### కంచ గచ్చిబౌలి భూములపై వెంటనే విచారణ చేపట్టాలి

(మొదటి పేజీ తరువాయి)

ఆయన కోరారు. ''కంచ గచ్చిబౌలి భూముల ఆర్థిక అక్రమాలపై విచారణ చేపట్టాలి. కాంగ్రెస్, భాజపా కుమ్మక్కు కాలేదని నిరూపించుకోవాలి. దీనిపై ప్రధాని వ్యాఖ్యలకే పరిమితం కాకుండా చర్యలు తీసుకోవాలి. కంచ గచ్చిబౌలి అంశం వందల ఎకరాల పర్యావరణ విధ్వంసం మాత్రమే కాదు.. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన రూ.10వేల కోట్ల ఆర్థిక మోసం. దీనిపై ఇప్పటికే దర్యాప్తు సంస్థలకు ఆధారాలతో సహా తెలిపాం. ఆర్థిక అవకతవకల అంశాన్ని కేంద్ర సాధికార కమిటీ నిర్ధరించింది. స్వతంత్ర విచారణ చేయాలని సూచించింది. దీనిపై వెంటనే కేంద్ర ప్రభుత్వం విచారణ చేపట్టాలి'' అని కేటీఆర్ కోరారు.

## 'వారు బెయిల్ తెచ్చుకున్న నిందితులు'

### డూప్లికేట్ గాంధీ కుటుంబానికి భారతీయ చట్టాలు వర్తించవా? కేంద్ర సహాయమంత్రి బండి సంజయ్ ధ్వజమెత్తారు

**హైదరాబాద్:** డూప్లికేట్ గాంధీ కుటుంబానికి భారతీయ చట్టాలు వర్తించవా?, రాజ్యాంగానికి అతీతులని అనుకుంటున్నారా?, నేషనల్ హెరాల్డ్ ఆస్తులను కాజేసేందుకు డూప్లికేట్ గాంధీ కుటుంబం చేసిన కుట్ర' అంటూ కేంద్ర సహాయమంత్రి బండి సంజయ్ ధ్వజమెత్తారు. యూపీఏ హయాంలోనే వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. అరెస్ట్ కాకుండా బెయిల్ తెచ్చుకున్న నిందితులు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ. ఇందులో బీజేపీ, మోదీ పాత్ర ఏముంది?, కాంగ్రెస్



కార్యకర్తలారా....నేషనల్ హెరాల్డ్ ఆస్తుల్లో మీ వాటా ఉంది. మీరు ధర్నా చేయాల్సింది.... టెన్ జన్‌పథ్ సోనియా ఇంటి ముందు. తప్పు చేస్తే సోనియా సహా అందరూ జైలుకు వెళ్లక తప్పదు. రాహుల్ స్ఫూర్తితో యంగ్ ఇండియా బ్రాండ్ పేరుతో ఫోర్త్ సిటీకి చెందిన 50 వేల కోట్ల ఆస్తులను కాజేసే కుట్ర. సుబ్రమణ్యస్వామి కేసులతో బీజేపీకి ఏం సంబంధం?, బూతులు మాట్లాడితే చప్పట్లు కొడుతుంటే నివారించాల్సింది పోయి సమర్థిస్తారా?, దావోస్ పెట్టుబడులు ఎటు పోయాయ్?...జపాన్ పర్యటన కూడా అంతే. కాంగ్రెస్, బీఆర్ఎస్ జాన్ జబ్బలు.... బీఆర్ఎస్ అవినీతి కేసులన్నీ నీరుగార్చడమే నిదర్శనం. విద్యుత్ కొనుగోళ్ల స్కాంపై నివేదిక ఇచ్చినా కేసీఆర్ కు కనీసం నోటీసు ఎందుకు ఇవ్వలేదు?, బెంగాల్ తరహా పరిస్థితులు తెలంగాణలో వచ్చే ప్రమాదముంది. దీనికి ముమ్మాటికీ కారణం రేవంత్ రెడ్డి కాబోతున్నరు. రేవంత్ ఆర్థిక సహకారంతోనే వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా మజ్లిస్ ఆందోళన చేస్తోంది. దీనిని అడ్డుకోకపోతే జరగబోయే పరిణామాలకు రేవంత్ రెడ్డి సర్కారే బాధ్యత వహించక తప్పదు' అని బండి సంజయ్ ధ్వజమెత్తారు.

## తమిళనాడులో అమిత్ షా రూల్ చెల్లదు...

(మొదటి పేజీ తరువాయి)

పొత్తు పెట్టుకునే సందర్భంలో తమిళనాడుకు సంబంధించి ఏ ఒక్క విషయంలోనూ బీజేపీ పెద్దలు క్లారిటీ ఇవ్వలేదని ధ్వజమెత్తారు. అవకతవకలు జరిగిన నీట్ ఎగ్జామ్స్ కు సంబంధించి రాష్ట్ర విద్యార్థులకు ఎటువంటి మినహాయింపును బీజేపీ ఇవ్వలేదన్నారు. అదే సమయంలో హిందీని తమిళనాడులో రుద్దమనే విషయంలో కూడా వారు ఏమీ స్పష్టత ఇవ్వలేదని, ఇక డీలిమిటేషన్ అంశంపై కూడా ఏమీ పెదవి విప్పలేదని బీజేపీని కార్నర్ చేశారు స్టాలిన్. తమిళనాడు గవర్నర్ ఆర్ ఎన్ రవి తమ ప్రభుత్వం పట్ల వ్యవహరించిన తీరును సుప్రీంకోర్టు తప్పుబట్టిన విషయాన్ని స్టాలిన్ ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఇది కేంద్ర ప్రభుత్వానికి ఒక చెంపు పెట్టులాంటి తీర్పని స్టాలిన్ వ్యాఖ్యానించారు. వ్యవస్థలను వ్యక్తులను అడ్డుపెట్టుకుని పెత్తనం చేయాలని ఎన్డీఏ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం చూస్తోందని ఆరోపించారు. తాను ఇక్కడ ఒక విషయం మాత్రం దేశ ప్రజలకు చెప్పదలుచుకున్నానని, తమ పోరాటం కేవలం తమిళనాడుకి,



తమిళ ప్రజలకు సంబంధించినది మాత్రమే కాదని, యావత్ దేశ ప్రజల తరఫున చేస్తున్న పోరాటంగా స్టాలిన్ అభివర్ణించారు. ఇది డీఎంకే బలమంటూ బీజేపీ, అన్నాడీఎంకేల పొత్తును దెప్పిపొడిచారు. అందుచేత తమిళనాడు ఎవరు వచ్చినా తమను ఏం చేయలేరని స్టాలిన్ వ్యాఖ్యానించారు.

# హైదరాబాద్‌లో కుండపోత వర్షం

(మొదటి పేజీ తరువాయి)

ట్రాన్స్‌ఫార్మర్‌పై భారీ వృక్షం పడిపోయింది. కంచన్‌బాగ్ 8, బహదూర్‌పురాలో 7.8 సెం.మీ, యాకూత్‌పురాలో 7.6, బేగంబజార్‌లో 6.9 సెం.మీ, సంతోష్‌నగర్ 6.9, దబీర్‌పురాలో 6.6 సెం.మీ వర్షపాతం నమోదైంది. తెలంగాణలో భిన్న వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయి. ఉదయం ఎండలు, సాయంత్రానికి వర్షాలు.. ఈదురుగాలులు, వడగళ్ల వానలతో జనం పరేషాన్ అవుతున్నారు. ఉత్తర మధ్య మహారాష్ట్ర నుంచి మరత్వాడ, అంతర్గత కర్ణాటక, రాయలసీయ, తమిళనాడు మీదుగా గల్ఫ్ మన్నార్ వరకు సముద్ర మట్టం మీదగా ద్రోణి కొనసాగుతోంది. రాష్ట్రంలో దక్షిణ, నైరుతి దిశగా గాలులు వీస్తున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో రెండు రోజుల పాటు వర్షాలు పడే అవకాశముందని వాతావరణ శాఖ పేర్కొంది. క్యుములోనింబస్ మేఘాలు కమ్ముకొని అక్కడక్కడ వర్షాలు పడే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ శాఖ వెల్లడించింది. ఇవాళ ఉరుములు, మెరుపులు, గంటకు **30-40** కి.మీతో వేగంతో ఈదురు గాలులతో కూడిన వర్షం పడుతుందని పేర్కొంది. రాష్ట్రంలో కొమరంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, నాగర్ కర్నూల్ జిల్లాలలో అక్కడక్కడ కురిసి



అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. వచ్చే మూడు, నాలుగు రోజులు అధిక ఎండలు నమోదయ్యే అవకాశం ఉందని పలు ఉత్తర, ఈశాన్య జిల్లాలకు వాతావరణ శాఖ ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది.



# శేరిలింగంపల్లిలోని 64చెరువులను సుందర శోభితంగా తీర్చిదిద్దుతాం

- మల్లిగవాడ్ ఫౌండేషన్ సేవలు అభినందనీయం
- భవిష్యత్తు తరాలకు ఆస్తులు కాదు మంచి ఆరోగ్యం,ప్రశాంత జీవితం ఇవ్వాలి
- చెరువులను సంరక్షించుకునే బాధ్యత ప్రజలందరి పైన ఉంది
- -పిఎసి ఛైర్మన్ ఆరెకపూడి గాంధీ2

**శేరిలింగంపల్లి, సిటీటైమ్స్:** శేరిలింగంపల్లి నియోజకవర్గం లోని 64 చెరువులను అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని, చెరువుల సుందరీకరణతో స్వచ్ఛమైన వర్షపు జల సిరులను ఒడిసిపడుద్దామని, చెరువుల జలకళతో గ్రామీణ వాతావరణం నెలకొల్పడమే నా ధ్యేయంగా పనిచేస్తానని, చెరువులను కాపాడితే అవి మనల్ని కాపాడుతాయని, జీవ వైవిధ్యం పెరుగుతుందని, పక్షులు వలసలు మొదలు అవుతాయి అని, చెరువుల సంరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యతగా చెరువులను దత్తత తీసుకొని అభివృద్ధి చేసే వారు కనబడే దేవుళ్ళతో సమానమని పిఎసి ఛైర్మన్ ఆరెకపూడి గాంధీ తెలిపారు. శుక్రవారం మియపూర్ డివిజన్ పరిధిలోని పటేల్ చెరువు, గుర్నాథమ్, మక్తా మహబూబ్ పెట్ లోని పెద్దకుడి చెరువు, సుందరీకరణలో భాగంగా నెక్సాస్ సెలెక్ట్ మాల్స్ కంపెనీ, ఐజియుఎస్, హెచ్ డిఎఫ్ సి బ్యాంక్ ల వారి సిఎస్ఆర్ ఫండ్స్ ద్వారా మల్లిగవాడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్వచ్ఛందంగా చేపట్టనున్న చెరువుల పునర్జీవనంలో భాగంగా సుందరీకరణ, పునరుద్ధరణ పనులను జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి, కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ తో కలిసి పిఎసి ఛైర్మన్ ఆరెకపూడి గాంధీ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మియపూర్ లో అన్ని చెరువులకు సుందరీకరణ భాగ్యము కలిగినదని, త్వరలోనే మియపూర్ రూపురేఖలు మారునని దశ దిశ మారినది అని ఇక్కడి పరిసర ప్రాంత ప్రజలకు స్వచ్ఛమైన ఆహ్లాదకరమైన వాతావరణం అందించడమే నా లక్ష్యం అని అన్నారు.చెరువు పునరుద్ధరణ ప్రభుత్వం, పరిశ్రమలు, సమాజం మధ్య భాగస్వామ్య ప్రయత్నాలు అర్థవంతమైన పర్యావరణ పురోగతిని ఎలా నడిపించగలదో చెప్పడానికి ఒక శక్తివంతమైన ఉదాహరణగా నిలుస్తుంది. ఈ ప్రాజెక్ట్ కీలకమైన సహజ వనరులను పునరుజ్జీవింపజేయడమే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా భవిష్యత్తులో సుస్థిరమైన అభివృద్ధి కోసం ఒక నమూనాను ఏర్పాటు చేస్తుంది అని అన్నారు.

**చందానగర్ డివిజన్ పరిధిలో గాంధీ పర్యటన**

చందానగర్ డివిజన్ పరిధిలోని దీప్తి శ్రీ నగర్ కాలనీలో రేగుల కుంట చెరువును, డంపింగ్ యార్డ్ ను పరిశీలించిన ఆరెకపూడి గాంధీ మాట్లాడుతూ.. రేగుల కుంట చెరువుకు దశ దిశ మారినది అన్నారు. అదేవిధంగా డంపింగ్ యార్డ్ ను పరిశీలించడం జరిగినదన, అక్కడ జరుగుతున్న చెత్త సేకరణ, నిర్వహణ తీరు తెన్నులను పరిశీలించడం జరిగినదని, భవన నిర్మాణ వ్యర్థాలను సిఎన్డికి అప్పగించాలని భవన నిర్మాణ వ్యర్థాలను రోడుపై వేసి ప్రజలకు అసౌకర్యానికి ,ఇబ్బందికి గురి చేయవద్దు అన్నారు. ఒక వేళ అటువంటి వ్యర్థాల తొలగించుటకు టోల్ ఫ్రీ నంబర్ 1800 1201159 ఒక కాల్ చేస్తే వారు మీ ఇంటికి వచ్చి భవన నిర్మాణ వ్యర్థాలను వెంటనే తీసుకొని పోతారు అని తెలిపారు. భవన వ్యర్థం నిర్మాణాలను రాంకీ సంస్థ వారు సేకరించి జీడిమెట్లలోని వారి డంపింగ్ యార్డుకి తరలిస్తారని తెలిపారు. కాలనీ వాసులకు ,ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అన్ని రకాల చర్యలు తీసుకోవాలని రోడ్ల కిరువైపుల చెత్త చెదారం లేకుండా తొలగించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, అన్ని రకాల చర్యలు తీసుకోవాలని సూచించారు.



**మసీదు బండలో చెరువులు పరిశీలించిన పిఎసి ఛైర్మన్ గాంధీ**

శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని మసీదు బండ లో గల కుడికుంట చెరువును కలిసి పరిశీలించిన పిఎసి ఛైర్మన్ ఆరెకపూడి గాంధీ మాట్లాడుతూ..కుడికుంట చెరువులో పేరుకుపోయిన గుర్రపు డెక్కను తొలగించడం జరిగినది అని, త్వరలోనే సుందరీకరణ పనులు చేపట్టి పూర్తి స్థాయిలో సుందరీకరణ చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని, కుడి కుంట చెరువు దశ దిశ మారుస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ డైరెక్టర్ గణేష్ ముదిరాజ్, కాలనీల అసోసియేషన్ సభ్యులు, కాలనీ వాసులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఏనుగుల శ్రీనివాస్ రెడ్డి నూతన కార్యాలయం ప్రారంభం

- అభినందనలు తెలిపిన మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్

**కుత్బుల్లాపూర్, సిటీటైమ్స్:** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ కార్పొరేటర్ ఏనుగుల శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నూతన కార్యాలయాన్ని శుక్రవారం మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఏనుగుల శ్రీనివాస్ రెడ్డి, ఏనుగుల మాధవరెడ్డి, ఏనుగుల శ్రీకాంత్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ ఇంద్రజిత్ రెడ్డి, పద్మారెడ్డి, మాజీ సర్పంచ్ రమేష్ యాదవ్, నాగిరెడ్డి, యువకిరణ్ రెడ్డి, శ్రీకాంత్, మధుసూదన్ రెడ్డి, శ్రీహర్ష, సుధాకర్, మోహన్, శంకర్ యాదవ్, మహిపాల్ రెడ్డితో పాటు తదితరులు పాల్గొన్నారు.



# జేఎన్టియు వద్ద చలివేంద్రం ప్రారంభోత్సవం

**నిజాంపేట్, సిటీటైమ్స్:** శ్రీ శ్రీ శ్రీ గురువిశ్వస్ఫూర్తి వారి దివ్య ఆశీస్సులతో ధ్యాన మనోప్రస్థానం ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని మాజీ కార్పొరేటర్ రజిత రవికాంత్ కొనియాడారు. శుక్రవారం వారి చేతుల మీదుగా చలివేంద్రాన్ని ప్రారంభించి నిర్వాహకులను అభినందించారు. ఆధ్యాత్మిక విశ్వ గురువు సైంటిఫిక్ సెయింట్ శ్రీ శ్రీ శ్రీ గురు విశ్వస్ఫూర్తి వారి మానవ సేవయే మాధవ సేవ అనే సిద్ధాంతంతో వాలంటీర్స్ చేస్తున్న ఈ సేవలను రజిత రవికాంత్ ప్రశంసించారు. శ్రీ గురువు ఆశీస్సులు అందరిపై ఉండాలని కోరుకున్నారు. ఈ మండువేసవిలో పాదచారులు ఆర్టీసీ ఉద్యోగులు ప్రయాణికులు అందరికీ ఈ చలివేంద్రం ఎంతోమంది దాహార్తిని తీరుస్తుంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో కూకట్ పల్లి చుట్టుపక్కల ఉన్న ధ్యానమనోప్రస్థానం వాలంటీర్స్ అందరూ పాల్గొన్నారు.




# వైభవంగా నిజాంపేట్ శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవం

- టిపీసీసీ వర్కింగ్ మాజీ ప్రెసిడెంట్ కుసుమ కుమార్ ప్రత్యేక పూజలు

**నిజాంపేట్, సిటీటైమ్స్:** శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆశీస్సులతో ప్రజలందు సుఖఃసంతోషాలతో వర్ధిల్లాలని రాష్ట్ర పీసీసీ వర్కింగ్ మాజీ ప్రెసిడెంట్ కుసుమ కుమార్ ఆకాంక్షించారు. శుక్రవారం నిజాంపేట్ లోని శ్రీ అయ్యప్ప స్వామి ఆలయం సమీపంలో గల భూ నీలా సామెత శ్రీ వెంకటేశ్వర స్వామి తృతీయ వార్షికోత్సవ వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలకు రాష్ట్ర పీసీసీ వర్కింగ్ మాజీ ప్రెసిడెంట్ కుసుమ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాల స్థాపనతో దైవ చింతన అలవడుతుందని తెలిపారు. కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శి నర్సారెడ్డి భూపతి రెడ్డి, కాంగ్రెస్ నాయకుడు మేడ శ్రీనివాస్ రావు, తదితరులు పాల్గొన్నారు.



# ఎన్ఎంసి బిఆర్ఎస్ పార్టీ సర్వ సభ సమావేశం



- హాజరైన మాజీ కార్పొరేటర్ ఆగం రాజు ముదిరాజ్

**నిజాంపేట్, సిటీటైమ్స్:** బిఆర్ఎస్ పార్టీ వరంగల్ సభ విజయవంతం చేయాలని నిజాంపేట్ కార్పొరేషన్ మాజీ కార్పొరేటర్ ఆగం రాజు ముదిరాజ్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. శుక్రవారం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్ ఆధ్వర్యంలో వరంగల్ లో నిర్వహించబోయే బిఆర్ఎస్ పార్టీ బహిరంగ సభకు సంబంధించిన ఎన్ఎంసి బిఆర్ఎస్ పార్టీ సర్వ సభ సమావేశంలో మాజీ కార్పొరేటర్ ఆగం రాజు ముదిరాజ్ హాజరై బిఆర్ఎస్ పార్టీ శ్రేణులకు పలు సూచనలు చేశారు.

# ఎన్నికలు ఎప్పుడు వచ్చినా కాంగ్రెస్ ఓటమి తథ్యం

- కాషాయ జెండా ఎగరడం ఖాయం
- శేరిలింగంపల్లిలో గావ్ ఛలో – బస్తీ ఛలో కార్యక్రమం
- రవికుమార్ యాదవ్ , గంగాధర్ రెడ్డిల దిశానిర్దేశం

**శేరిలింగంపల్లి, సిటీటైమ్స్:** భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవ ఉత్సవాల సందర్భంగా, బీజేపీ పార్టీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు గచ్చిబౌలి డివిజన్ అధ్యక్షుడు శివ సింగ్ నాయకత్వంలో గోపనపల్లి లోని మంజీరా డైమండ్ హైట్స్ లో స్వచ్ఛ భారత్ అభియాన్ లో భాగంగా స్వచ్ఛత కార్యక్రమాన్ని నిర్వహించారు .ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, శేరిలింగంపల్లి అసెంబ్లీ ఇంచార్జి రవికుమార్ యాదవ్, గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి పరిసరాలను శుభ్రపరిచి, ప్రజల్లో పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి మాట్లాడుతూ.. పేదల అభ్యున్నతే లక్ష్యంగా ప్రధాని నరేంద్ర మోడీ ప్రవేశపెట్టిన పలు కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికీ చేరేలా చేయాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నాం అన్నారు. ప్రజల సమస్యలు తెలుసుకొని వాటికి పరిష్కార మార్గాలు చూపడం, వారి అభివృద్ధికి తోడ్పడడం మా బాధ్యత అని పేర్కొన్నారు. అనంతరం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, శేరిలింగంపల్లి అసెంబ్లీ ఇంచార్జి రవికుమార్ యాదవ్ గారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 16 నెలల్లో ప్రజలకు చేసింది ఏమి లేక రాజ్యాంగం ముసుగులో రాజకీయ పబ్బం గడుపుకుంటున్నారు.అసలు రాజ్యాంగం లో ఏమేమి ఉంటాయో తెలియని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు రాజ్యాంగాన్ని పట్టుకొని తిరుగుతున్నారు. ఇంతలా కాంగ్రెస్ ప్రభుత్వం దిగజారే స్థాయికి చేరింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన 16 నెలల్లో ప్రజలు ఏం కోల్పోయారో వారికి అర్థమైందని, ఎప్పుడు ఎన్నికలు జరిగినా కాంగ్రెస్ పార్టీని చిత్తుచిత్తుగా ఓడిగోట్టేందుకు ప్రజల సిద్ధంగా ఉన్నారన్నారు. పార్టీకి వెన్నెముకైనా కార్యకర్తలు రాబోయే రోజుల్లో స్థానికంగా ప్రజలతో మమేకమై సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని, కష్టపడి పనిచేసిన నాయకులు, కార్యకర్తల కోసం పార్టీ పనిచేస్తుందని అన్నారు.16 నెలల కాంగ్రెస్ పాలనలో తెలంగాణలో జరిగిన విధ్వంసాన్ని ప్రజలు చూశారని, భవిష్యత్తు అంతా మనదేనని అన్నారు ఈ కార్యక్రమం లో గచ్చిబౌలి డివిజన్ అధ్యక్షుడు ,శివ సింగ్ సీనియర్ నాయకులు వసంత కుమార్ యాదవ్, రంజిత్ పూరి, హనుమంత్ నాయక్,కిషన్ గౌలి, ప్రభాకర్, తిరుపతి, రాజు, గోవింద, మహేష్ , సీనియర్ నాయకురాలు వరలక్ష్మి ధీరజ్, మంజీర డైమండ్ హైట్స్ వాసులు అతుల్ పీఎల్ రావు, సుమంత్, అర్జున్, వరప్రసాద్, మదన్, క్రాంతి, రఘు, ఉదయలక్ష్మి, శశి, ప్రియ, తులసి, హేమ, శ్రీలక్ష్మి, రజినీ, బీజేపీ నాయకులు,స్థానిక నేతలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# మేఘన్న అభయస్తం భరోసా మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం



**వనపర్తి టౌన్ సిటీ టైమ్స్ ఏప్రిల్ 18**

వనపర్తి జిల్లా కేంద్రంలో మారెమ్మ కుంట 15 వ వార్డులో బల్మూర్ శారద కుటుంబానికి 5000 రూపాయలు ఆర్థిక సాయం అందజేసి వారి కుటుంబానికి అండగా ఉంటానని భరోసా ఇచ్చిన వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి వనపర్తి పట్టణంలో మారెమ్మ కుంట 15 వ వార్డుకు చెందిన బల్మూర్ శారద ఈరోజు మరణించడం జరిగింది స్థానిక నాయకులు రఘు యాదవ్ వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి కి సమాచారం ఇవ్వగా ఎమ్మెల్యే ఆదేశాల మేరకు వనపర్తి పట్టణ అధ్యక్షులు చీర్ల విజయ చందర్ ద్వారా ఆర్థిక సాయం అందజేయడం జరిగింది కిరణ్ రాజ శేఖర్ సాగర్ భాను అందరు కలిసి మరణించిన బల్మూర్ శారద మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటామని భరోసా ఇవ్వడం జరిగింది.

# ఛలో వరంగల్‌కు ఇంటికి ఒక్కరు తరలి రావాలి

- ఏప్రిల్ 27న బిఆర్ఎస్ ప్రభంజనం సృష్టిద్దాం
- వాల్ రైటింగ్స్ కు రంగులు అద్దిన రవీందర్ యాదవ్ పిలుపు

**శేరిలింగంపల్లి, సిటీటైమ్స్:** బిఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా అత్యంత ఘనంగా జరగబోయే భారీ బహిరంగ సభకు పెద్ద ఎత్తున ప్రజలు తరలి రావాలని శేరిలింగంపల్లికి చెందిన బిఆర్ఎస్ సీనియర్ లీడర్ రవీందర్ యాదవ్ పిలుపునిచ్చారు.శుక్రవారం శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ఛలో వరంగల్.. జై కేసీఆర్ అంటూ రాసిన వాల్ రైటింగ్స్ లో స్వయంగా పాల్గొని రాశారు. రజతోత్సవ సభను విజయవంతం చేయాలని ప్రతిఒక్కరిని కోరుతున్నానని వెల్లడించారు. తెలంగాణ కోసం నిరంతరం పోరాడే పార్టీగా బిఆర్ఎస్ కు ప్రజల గుండెల్లో నిలిచిందన్నారు. ఈ నెల 27న నిర్వహించబోయే సభతో ప్రభంజనం సృష్టించబోతున్నామని ధీమా వ్యక్తం చేసిన ఆయన కాంగ్రెస్ పై పోరుబాటకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.





# చల్లటి కబురు!

భానుడు ఉగ్రరూపం దాల్చే ఏప్రిల్ నెలలోనే ప్రాణం కుదుటపడేలా జూన్‌లో ఆగమించే నైరుతి రుతుపవనాల తీరుతెన్నులు చెప్పడం మన వాతావరణ సంస్థలకు అలవాటు. ఈసారి భారతీయ వాతావరణ విభాగం(ఐఎండీ) ప్రకటించినదాన్నిబట్టి సాధారణ వర్షపాతంకన్నా అధికంగానే వానలు పడొచ్చు. అంతేకాదు... వర్షాభావానికి దారితీసి కరువు కాటకాలకు కారణమయ్యే ఎల్ నినో బెడద కూడా ఉండకపోవచ్చని కూడా ఆ విభాగం తెలియజేసింది. అయితే వాతావరణ స్థితి గతులను అంచనా వేసే మరో సంస్థ స్కైమెట్ మాత్రం 'సాధారణ' స్థాయిలోనే రుతుపవనాలుంటాయని చెబుతోంది.

ఈ నెల మొదట్లోనే ఇందుకు సంబంధించిన లెక్కలు ప్రకటించి, సాధారణంకన్నా అధికంగా వర్షాలు పడే అవకాశం 30 శాతం మాత్రమే ఉన్నదని తెలిపింది. నైరుతి రుతు పవనాలు సాధారణంగా జూన్ 1న ప్రవేశించి చకచకా విస్తరించుకుంటూపోయి సెప్టెంబర్ మధ్య కల్లా నిష్క్రమిస్తాయి. దేశ జనాభాలో 42.3 శాతం మందికి జీవనాధారమైన వ్యవసాయం పూర్తిగా రుతుపవనాలపై ఆధారపడి వుంటుంది. అది సక్రమంగా వచ్చి వెళ్తే దేశం కళకళలాడుతుంది.

మందగమనంతో అడుగులేస్తే, అంతంతమాత్రంగా ముగిసిపోతే అనేక సమస్యలకు దారితీస్తుంది. మన స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)లో వ్యవసాయం వాటా 18.2 శాతం. అయితే 'వాన రాకడ... ప్రాణం పోకడ ఎవరికీ తెలియద'న్న నానుడి మరిచిపోకూడదు. వర్షపాతం బాగుంటుందన్నా, అది అధికంగా ఉండొచ్చని చెప్పినా దేశవ్యాప్తంగా అన్నిచోట్లా అదే మాదిరిగా ఉంటుందని ఆశించలేం. స్థానిక కాలమాన పరిస్థితులనుబట్టి కొన్నిచోట్ల అధిక వర్షపాతం, మరికొన్నిచోట్ల అవసరమైన దానికన్నా తక్కువగావుండొచ్చు. బ్రిటిష్ వ్యంగ్య రచయిత జెరోమ్ కె. జెరోమ్ ఒక సందర్భంలో చెప్పినట్టు వాతావరణం అనేది ప్రభుత్వం వంటిది. అదెప్పుడూ చెడ్డగానే ఉంటుంది!

ఎక్కడో భూమధ్య రేఖకు ఆనుకునివున్న పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడివున్న వర్తమాన వాతావరణ పరిస్థితులు మన రుతుపవనాలను నిర్దేశిస్తాయి. పసిఫిక్ మహాసముద్ర ఉపరితలంపై, ముఖ్యంగా దక్షిణమెరికా తీర ప్రాంతంవైపు ఉష్ణోగ్రతలు అధికంగావుంటే గాలిలో తేమ శాతం పెరిగి ఎల్ నినో ఏర్పడి రుతుపవనాలు బలహీనపడతాయి. వర్షాలు లేక కరువుకాటకాలు విజృంభిస్తాయి. ఆ ఉష్ణోగ్రతలు తక్కువుంటే లానినా ఏర్పడి కుంభవృష్టికి దారితీసి వరదల బెడదవుంటుంది. ప్రస్తుతానికి అక్కడ తటస్థ పరిస్థితులున్నాయంటున్నారు.

ఒక్కోసారి మన హిందూ మహాసముద్రంపై ఆవరించివుండే మేఘాల స్థితిగతులు, ఆ వాతావరణంలోవుండే గాలి తుంపరలు, మనకుండే అటవీ సాంద్రత వంటివి ఎల్ నినోను ప్రభావితం చేస్తాయి. ఈ కారణంవల్లనే పసిఫిక్ మహాసముద్రంలో ఎల్ నినో ఏర్పడినా ఒక్కోసారి మన రుతుపవనాలు సజావుగా వచ్చివెళ్తాయి. అందుకే ఎల్ నినో గురించి పట్టించుకోవటం, రుతుపవనాలను ముందుగా అంచనా వేయటం అశాస్త్రీయం అంటారు కొందరు శాస్త్రవేత్తలు. ఎల్ నినోను నియంత్రించే ఇతరేతర పరిస్థితులు అనేకం ఉన్నప్పుడు దాని ఆధారంగా వర్షాల గురించి అంచనా వేయటం వృధా ప్రయాస అని వారి భావన. వర్షరుతువులో ఏటా వర్షపాత సగటు(ఎల్‌పీఏ) ఎంతవుంటున్నదో లెక్కేయటం ఐఎండీ పని. ఆ సగటు దీర్ఘకాలంలో ఎంతవుందో గణించి, దానికన్నా ఎంత ఎక్కువగా లేదా ఎంత తక్కువగా వర్షాలు పడే అవకాశం వుందో తెలియజేస్తారు. ఎల్‌పీఏను 87 సెంటీమీటర్ల వర్షపాతంగా గణించి, ఈసారి వర్షాలు దీన్నిమించి 105 శాతంవరకూ ఉండొచ్చని అంచనా కట్టారు. నిరుడు మొదట్లో 106 శాతం అధిక వర్షపాతం అంచనా వేయగా, అది 108 శాతం వరకూ పోయింది. ఎల్‌పీఏ 96 శాతంకన్నా తక్కువుంటే సాధారణంకన్నా తక్కువ వర్షపాతంగా లెక్కేస్తారు. 96–104 మధ్యవుంటే సాధారణ వర్షపాతంగా, 104–110 శాతం మధ్యవుంటే అధిక వర్షపాతంగా పరిగణిస్తారు.

ఐఎండీ 105 శాతంవరకూ ఉండొచ్చని అంచనా వేయగా, స్కైమెట్ మాత్రం 103 శాతానికి పరిమితమైంది. మన దేశంలో సాగుకు యోగ్యమైన భూమిలో 60 శాతంవరకూ వర్షాధారమే. కనుక వర్షాలు సమృద్ధిగా పడితేనే మన సాగురంగం బాగుంటుంది. అందరికీ పనులు దొరికి సుఖసంతోషాలతో వుంటారు. ప్రజల కొనుగోలు శక్తి పెరుగుతుంది. వర్షపాతం అంచనాలు సక్రమంగావుంటే ఎక్కడ ఎలాంటిపంటలు వేసుకోవచ్చునో, వేటికి అననుకూలతలు ఏర్పడవచ్చునో తెలుస్తుంది.

రైతులు నష్టపోకూడదంటే ఇలాంటి అంచనాలు ఎంతో అవసరం. కానీ నిర్దుష్టంగా అంచనాలు చెప్పటం అన్ని వేళలా సాధ్యపడకపోవచ్చు. గతంతో పోలిస్తే వాతావరణ విభాగం అంచనాలు మెరుగ్గా ఉంటున్నాయి. ఆ రంగంలో పెరిగిన సాంకేతికతలే అందుకు కారణం.వర్షాలు సాధారణంకన్నా ఎక్కువుంటాయని వేసిన అంచనాలు చూసి మురిసిపోలేం. ఎందుకంటే కురిసిన వర్షాన్నంతటినీ ఒడిసిపట్టి తాగునీటి, సాగునీటి అవసరాలు తీర్చుకునే మౌలిక సదుపాయాలు మనదగ్గరుండాలి. తొలకరినాటికల్లా సాగుపనుల కోసం రైతులకు డబ్బు అందు బాటులో వుండాలి. సకాలంలో నాట్లు పడకపోతే పైరు ఎదుగుదల బాగుండదు.

భిన్న దశల్లో ఎరువులూ, పురుగుమందులూ దొరకాలి. అన్నిటికన్నా ముందు విత్తనాల లభ్యత సక్రమంగావుండాలి. కల్తీ విత్తనాల బెడద నిరోధించాలి. వీటికోసం ఎలాంటి ముందస్తు చర్యలు అమలు కావాలో, రైతులకు బ్యాంకుల నుంచి రుణసదుపాయాలెలా కల్పించాలో ప్రభుత్వాలు ఆలోచించాలి. రుతుపవనాలు సక్రమంగా ఉండబోతున్నాయని ఐఎండీ ప్రకటించింది కనుక ఇప్పటినుంచే పకడ్బందీ ప్రణాళికలు రూపుదిద్దుకోవాలి.

# పెరుగుతున్న మత సమ్మతి



**దేశంలో మతతత్వం పెరిగిపోతోంది. కొన్నేళ్లుగా ఈ ధోరణి మరీ ఎక్కువైంది. అడుగడుక్కీ గుళ్లు, మసీదులు వెలుస్తున్నాయి. నేనీ మధ్య తెలంగాణ వెళ్లాను. చిన్న పల్లె టూళ్లలో సైతం రెండు మూడు దేవాలయాలు ఉన్నాయి. హిందువులకు దేవుళ్లు చాలామంది, కాబట్టి గుళ్ళు కూడా ఎక్కువ గానే ఉంటాయి అనుకోవడం పొరపాటు. హిందూ సమాజం కులాలు, గోత్రాలు, జాతులు,వంశాలుగా చీలిపోయి ఉంది. గుళ్లు గోపురాలు అసంఖ్యాకంగా పుట్టుకురావడానికి ఈ భిన్నవర్గాల సమాజం ఒక ప్రధాన కారణం.**

జనంలో పెరుగుతున్న వ్యాపార దృష్టి ఇందుకు మరొక ముఖ్య కారణం అనిపిస్తోంది. పౌర సంఘాలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తు న్నాయి. ఇవి రాజ్యాంగ విరుద్ధంగా ఆర్థిక కార్యకలాపాలను తమ చెప్పుచేతుల్లో పెట్టుకుంటున్నాయి. పట్టణ ప్రాంతాల్లో పార్కింగ్ ఏజెంట్లకు, బళ్లపై పళ్లు అమ్ముకునే వారికి, అనేకానేక చిల్లర పనులకు రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్లు 'లైసెన్స్'లు ఇచ్చి డబ్బు పోగేసుకోవడం మనకు తెలుసు. గ్రామాల్లో సైతం ఈ తరహా సంస్కృతి విస్తరించింది. గ్రామ కమిటీలు అంటూ తయారయ్యాయి.

ఇవీ ఇదే మాదిరిగా కొత్త ఆదాయ మార్గాలు కనిపెట్టాయి. ఇసుక మైనింగు, అక్రమ మద్యం అమ్మకాల వంటి కార్యకలాపాలను ఈ కమిటీలు నియంత్రిస్తున్నాయి. ఆ డబ్బును ప్రజల రోజువారీ జీవితాలను బాగు పరచేందుకు వాడతారా అంటే అదీ లేదు. బహుశా ఇక్కడికంటే పరలోకపు జీవితాలకు గిరాకీ ఎక్కువలా ఉంది. అందుకే, ఇలా ఆర్జించిన డబ్బును గుళ్లు కట్టడానికి వాడుతున్నారు.

**పెరుగుతున్న భక్తి**

మతం ఇప్పుడు రాజకీయాల్లో కంటే ఆర్థిక రంగంలో కీలకపాత్ర పోషిస్తోంది. దేశ స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)లో పర్యాటక ఆదాయం వాటా 9.6 శాతం. ఇందులో దేశీయ పర్యాటకం 88శాతం. గతేడాది ఇండియా సందర్శించిన విదేశీ పర్యాటకులు కేవలం 90 లక్షలు కాగా, స్థానిక యాత్రికుల సంఖ్య కళ్లు చెదిరేలా 14 కోట్లను దాటింది. కేంద్ర ప్రభుత్వాలు పర్యాటక రంగాన్ని ప్రోత్సహించడానికి ఢిల్లీ-ఆగ్రా-జైపూర్ 'స్వర్ణ త్రిభుజం' మీద అధిక శ్రద్ధ పెడుతుంటాయి.

వాస్తవానికి తమిళనాడు సందర్శించేవారు అత్యధికంగా 20 శాతం ఉన్నారు. ఢిల్లీ పర్యాటకులు వారిలో సగం ఉంటారు. దక్షిణాది రాష్ట్రాలు దేశవిదేశాల టూరిస్టులను ఆకర్షించడంలో ముందు వర సలో నిలుస్తాయి. కారణం - మతపరంగా ప్రముఖమైన తిరుపతి, మదురై వంటి ప్రదేశాలు వీటిలో ఎక్కువగా ఉండటమే. తిరుపతి వల్ల ఆంధ్రప్రదేశ్ ఇండియాలోనే అతిపెద్ద దేశీయ పర్యాటక ప్రదేశంగా రూపొందింది. రెలిజియస్ టూరిజం ఇప్పుడు అతిపెద్ద వ్యాపారం.

గడచిన నాలుగైదు ఏళ్లలో గతంలో కంటే అధికంగా మతం మీద మమకారం పెంచుకున్న భారతీయులు 25 శాతం పైగానే ఉన్నారని 'ప్యూ' సంస్థ నిర్వహించిన 'గ్లోబల్ యాటిట్యూడ్' సర్వే తేల్చింది. ఇది ఏ ఒక్క మతానికో పరిమితం కాదు. అన్ని మతాల్లోనూ ఈ ధోరణి కనబడింది. మతం ఎంతో ముఖ్యమైందని భావిస్తున్న వారు 2007-15 మధ్య ఏకంగా 80 శాతానికి పెరిగారు. 11 శాతం పెరుగుదల! ఎన్ఎస్ఎస్ఓ (నేషనల్ శాంపుల్ సర్వే ఆఫీస్) నివేదిక ప్రకారం, మత ప్రదేశాల సందర్శనలపై చేసిన సగటు వ్యయం ఇదే కాలంలో రెట్టింపు కంటే ఎక్కువైంది. మత వ్యాపారానికి ఆకాశమే హద్దు (ఇందులో శ్లేష లేదు).

ఇది ఉపాధి అవకాశాలు పెంచవచ్చు. సంతోషమే! మరి మత భావన పెరుగుతూ పోవడం వల్ల తలెత్తే ఇతర పరిణామాల మాటేమిటి? సమాజంలో మూఢనమ్మకాలు, అంధభక్తి, మతపిచ్చి పెచ్చరిల్లుతాయి. ఒక ఆధునిక సమాజంగా ఇండియా ఆవిర్భవించకుండా ఇవి అడ్డుపడే ప్రమాదం ఉంది.

**లాభదాయక వ్యాపారం**

గుళ్లు లేదా మసీదులు నిర్మించడం లాభదాయక వ్యాపారం.అందుకే, ప్రార్థనా మందిరాల పేరిట నీతి లేని మనుషులు బహిరంగ ప్రదేశాలను కబ్జా చేయడం రివాజుగా మారుతోంది. ఒకసారి దేవుళ్ల విగ్రహాలు ప్రతిష్ఠిస్తే, ఇక వాటిని ఎవరూ తొలగించలేరు. నగరాల్లో ట్రాఫిక్ చిక్కులకు ఈ నిర్మాణాలే చాలావరకు కారణాలు.సంత్ కబీర్ దాసు ఎంతో సరళంగా చెప్పిన కవితను ఈ సందర్భంగా నేను ప్రస్తావిస్తాను: 'రాతిని పూజించడం వల్ల దేవుడు లభిస్తే, నేను పర్వతాన్ని పూజిస్తాను. కానీ ఈ చక్కీ (తిరగలి రాయి)మంచిది, ఎందుకంటే ఇది ప్రపంచాన్ని పోషిస్తుంది'. చేదు నిజం ఏమిటంటే, రాతి విగ్రహం తిరగలి రాయి కంటే మంచి ప్రతిఫలం ఇస్తోంది. మతభావన, మతపిచ్చి వ్యాపారంగా మారబట్టే, ప్రభుత్వాలు సైతం 'రెలిజియస్ టూరిజం'కు పెద్దపీట వేస్తున్నాయి.వాస్తవానికి, 'మీ విగ్రహం కంటే మా విగ్రహం మంచిది' అనే రీతిలో ఒక కనిపించని పోటీకి దారి తీస్తోంది. తిరుమల ఆలయం ఇండియాలోనే అతి పెద్ద 'మనీ స్పిన్నర్'. ఈ వైష్ణవ ఆలయాన్ని ఏటా 4 కోట్ల మంది దర్శించుకుంటారు. ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వం యాదగిరిగుట్టను పెద్ద మత పర్యాటక కేంద్రంగా ప్రమోట్ చేస్తోంది.

సీపీఎం కమ్యూనిస్టు ప్రభుత్వ హయాంలో కేరళ దేవాలయ బోర్డులు విగ్రహాల 'మహిమల' గురించి ప్రచారం చేస్తున్నాయి. దేవుడు మానవుడి ఊహాకల్పన అంటూ మనల్ని హేతుబద్ధంగా ఆలోచింప జేయాల్సిన సిద్ధాంతం ఆ ప్రభుత్వానిది. కానీ మాస్కో రెడ్ స్క్వేర్ , చైనా తియనాన్మెన్‌లలో మమ్మీలుగా మారిన శవాల నుంచి స్ఫూర్తి పొందే సిద్ధాంతం నుంచి ఇంతకంటే ఏం ఆశించగలం?

**బహిరంగ సమర్థనా?**

మన తొలి ప్రధాన మంత్రి, నవ భారత వ్యవస్థాపక పితా మహుడు జవహర్‌లాల్ నెహ్రూ దేశం శాస్త్రీయ దృక్పథంతోముందుకు సాగాలని తలచారు. ఇప్పుడేం జరుగుతోంది? పిడివాదం, అంధవిశ్వాసం మనల్ని నడిపిస్తున్నాయి. మతం, మూఢభక్తి దేశానికి ప్రమాదకరంగా రూపుదిద్దుకుంటున్నాయి. సమాజంలో ఘర్షణ వాతావరణం నెలకొంది. నెహ్రూ ఎప్పుడూ ప్రార్థనా స్థలాలు సందర్శించలేదు. విశ్వాసి అయినప్పటికీ ఇందిరా గాంధీ సైతం ఆలయాలకు దూరంగానే ఉండే వారు.

అయితే ఆమె మనవడు రాహుల్ గాంధీ బొట్టు పెట్టుకుని గుళ్ల చుట్టూ తిరుగుతున్నారు. జంధ్యం కూడా ధరిస్తానని ప్రకటించారు. తాను శివభక్తుడినని చెప్పుకొంటారు. అమిత్ షా కూడా అదే చేస్తారు. ఇద్దరికీ కావల్సింది ఓట్లు! రేపిస్టుగా రుజువైన రామ్ రహీం సింగ్‌ను నరేంద్ర మోదీ ప్రశంసించడం అతడి నుంచి రాజకీయ మద్దతు ఆశించే కదా? రాజ్యాంగ పరిరక్షకులు, ప్రముఖ వ్యక్తులు ఆర్భాటంగా మత స్థలాలు సందర్శించడం పెరిగింది. గతేడాది రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తిరుమల ఆల యంలో ప్రార్థనలు చేయడం మనకు తెలుసు.

అంతకు ముందు ఏడాది మోదీ కేదార్‌నాథ్, బద్రీనాథ్ పుణ్య క్షేత్రాలు దర్శించారు. మాజీ రాష్ట్రపతి కోవింద్ తిరుమల ఆలయంలో బాహాటంగా పూజలు నిర్వహించారు. పూరీ జగన్నాథాలయంలో ఆయన అవమానం పాలైనట్లు వార్తలు వచ్చాయి. ప్రధాని కేదార్‌నాథ్ లేదా అయోధ్య సందర్శించినా, మరొకరు అజ్మీర్ షరీఫ్ వెళ్లినా అది వాటిని ఆమోదించడమే అవుతుంది. అలా వెళ్లడం... షారుఖ్ ఖాన్ కోక్ బ్రాండ్‌కు ప్రచారం చేయడం కంటే భిన్నమైనమీ కాదు.

# పటేల్‌కూ, నెహ్రూకూ పడదంటారా?



ఇండియా ఈ ఏడాది అక్టోబర్ 31నసర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ 150వ జయంత్యుత్సవం జరుపుకోబోతోంది. జనం మర్చిపోయిన పటేల్ గుణగణాలు కొన్ని నేను ఈ సందర్భంగా గుర్తు చేస్తాను. తన సహోదరులను ఆయన ఎంతో జాగ్రత్తగా చూసుకున్నాడు. వల్లభ్‌కు నలుగురు సోదరులు. వారిలో ముగ్గురు తన కంటే పెద్ద వారు. ఆయన ఏకైక సోదరి దహిబా అందరికంటే చిన్నది. సంతానంలో మధ్యవాడు కాబట్టి వల్లభాయికి చిన్నతనంలో తగినంత మన్నన, ఆప్యాయత లభించలేదు. ఈ అనాదరణే ఆయనను ఒక వాస్తవవాదిగా, యోధుడిగా మార్చింది. తండ్రి ఝవేర్ భాయ్ ఎప్పుడూ ధనికుడు కాదు. పైగా కాలక్రమంలో ఉన్నది కూడా కరిగిపోయింది. వల్లభ్ తెలివైన వాడు, విశాల హృదయుడు. కాబట్టే, తోడబుట్టిన అయిదుగురి బాగోగులు, డబ్బు అవసరాలు తనే చూసుకున్నాడు. వల్లభ్ దయాగుణం నుంచి ఆయన చిన్నన్న విఠల్ భాయ్ అత్యధికంగా ప్రయోజనం పొందాడు. మన స్వాతంత్ర్యోద్యమ హీరో కూడా అయిన విఠల్ 1933లో యూరప్‌లో అనారోగ్యంతో చనిపోయాడు. ఆ సమయంలో సుభాష్ చంద్రబోస్ ఆయనకు సుశ్రూషలు చేశాడు. విఠల్ భాయ్ 1925-30 కాలంలో సెంట్రల్ లెజిస్లేటివ్ అసెంబ్లీ ప్రెసిడెంట్‌గా వ్యవహరించాడు. ఈ ఇద్దరు సోదరులూ బొర్సాద్ (గుజరాత్) టౌనులో లాయర్లు. ఆ సమయంలో, వల్లభ్ లండన్ వెళ్లి బారిష్టర్ అవ్వాలని నిర్ణయించుకున్నాడు. అందుకు అవసరమైన డబ్బు పొదుపు చేసుకుని పాస్‌పోర్టు, టికెట్ సంపాదించాడు.

అయితే వీజే పటేల్, ప్లీడర్, బొర్సాద్ పేరిట ఆయనకు వచ్చిన కవరును పోస్ట్‌మన్ అదే పేరుతో నమోదై ఉన్న సోదరుడు విఠల్ ఇంటికి బట్వాడా చేస్తాడు. దీంతో విఠల్‌కు తానూ ఇంగ్లాండు వెళ్లి బారిష్టరు కావాలన్న ఆలోచన వచ్చింది. ముందు నువ్వు వెళ్తే నీకంటే పెద్దవాడినైన నేను ఆ తర్వాత వెళ్లలేను. నీ పాస్ పోర్టు, టికెట్‌తో నేను లండన్ వెళ్తాను అని తమ్ముడిని కోరతాడు. వల్లభ్ సరే అనడమే కాకుండా విఠల్ లండన్ చదువుకు డబ్బు కూడా సమకూర్చాడు. ఆయన కుటుంబ భారాన్నీ మోశాడు. నాలుగేళ్ల తర్వాత 1910లో తనూ లండన్ వెళ్లి అద్భుత ప్రతిభ కనబరచి, 1912లో బారిష్టర్ పట్టాతో ఇండియా తిరిగి వస్తాడు.

జైల్లో ఉండి కూడా సర్దార్ సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ తన సాటి సమర యోధులను ఎందరినో ఆర్థికంగా ఆదుకునేవాడని, వారి వైద్య ఖర్చులకు సాయం చేసేవాడని... పటేల్ జీవిత చరిత్ర కోసం 1987 ఏప్రిల్లో నేను ముంబాయిలో ఇంటర్వ్యూ చేసినప్పుడు మురార్జీ దేశాయ్ చెప్పారు. సాటి సమర యోధుల ఇక్కట్లను చూసి మన ఉక్కుమనిషి హృదయం ఇట్టే కరిగిపోయేది. సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ జీవితంలో ఆయన ఔన్నత్యాన్ని చాటిచెప్పే గొప్ప సంఘటనలు ఎన్నో ఉన్నాయి. అవి నేడు ఎంతమందికి తెలుసు? 1927 జులైలో పెను తుపాను రావడంతో గుజరాత్ విలవిల్లాడి పోయింది. ఆ సమయంలో బాధితులను ఆదుకునేందుకు అహ్మదా బాద్, పరిసర ప్రాంతాల్లోని ఎందరో ఆయన స్ఫూర్తితో ముందు కొచ్చారు. అప్పట్లో పటేల్ గుజరాత్ కాంగ్రెస్ కమిటీ, అహ్మదాబాద్ మునిసిపల్ కౌన్సిల్ రెంటికీ అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు. సహాయక చర్యలు చేపట్టడంలో కనబరచిన దక్షతను గుర్తించి బ్రిటిష్ రాజ్ అధికారులు ఆయనకు తగిన బిరుదు ఇవ్వజూపారు. సమాధానంగా ఆయన బిగ్గరగా ఒక నవ్వు నవ్వారు. 'సర్ వల్లభ్ భాయ్' అని పిలిపించుకుంటే చాలామందికి అప్పుడు ఇప్పుడు సంబరంగా ఉండేదేమో. కాని, ఖేదా జిల్లా వాసులైన ఝవేరీభాయ్, లద్బా దంపతుల ఈ బిడ్డ ఎంతో గట్టి మనిషిగా, ఎన్నో కీలక పర్యవసానాలకు కారకుడిగా భారత దేశ భావితరాలకు తన ముద్రను మిగిల్చి వెళ్లేవాడా?

దాదాపు ఒక శతాబ్దం క్రితం 1920లలో మునిసిపల్ కౌన్సిల్ సారథిగా పటేల్ అహ్మదాబాద్‌ను 'నడిపించాడు'. అలాగే జవహర్ లాల్ నెహ్రూ అలహాబాద్‌ను 'నడిపిస్తున్నాడు'. 1920-22 సహాయ నిరాకరణ ఉద్యమానికి 1930-33 శాసనోల్లంఘన ఉద్యమానికి మధ్య కాలమది. దేశం ఇతర ప్రాంతాల్లో, కోల్‌కతా మునిసిపాలిటీకి చిత్తరంజన్ దాస్, పాట్నా టౌన్ కౌన్సిల్‌కు రాజేంద్ర ప్రసాద్, ముంబాయి మునిసిపాలిటీకి విఠల్ భాయ్ పటేల్ సారథులుగా ఉన్నారు. 1947లో స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత అప్పుడు నేర్చుకున్న పాఠాలు ఎంతగానో ఉపకరించాయి.

1948లో, వల్లభ్ భాయ్ పటేల్ నగర పాలక పాత్రకు ముగింపు పలికి రెండు దశాబ్దాలు ముగిసిన సందర్భంగా, ముంబాయిలో ఆయనకు పుర ప్రముఖులు ఘనంగా నివాళులు అర్పించారు. స్వతంత్ర భారత ఉప ప్రధాని ఆ సభలో మాట్లాడుతూ, ''మీరు ఎన్నో విజయాలు ప్రస్తావించారు. వాటిలో కొన్ని నేను సాధించినవి. కొన్ని నేను సాధించనివి. కాని అభ్యంతరం లేకుండా నేను అంగీకరించే ఒక విషయం: అహ్మదాబాద్ మునిసిపాలిటీకి నా శక్తివంచన లేకుండా సేవ చేశాను. స్వచ్ఛమైన ఆనందం పొందాను... నగరంలోని మురికిపై పోరాడితే మీకు రాత్రి చక్కగా నిద్ర పడుతుంది. రాజకీయాలతో వ్యవహరించేటప్పుడు మీకు రాత్రి కూడా ప్రశాంతత ఉండదు'' అని వ్యాఖ్యానించారు.

నగర బాధ్యతల నుంచి వైదొలగిన తర్వాత పటేల్ అసాధారణ నాయకత్వ ప్రతిభ వెలుగులోకి వచ్చింది. 1928లో గుజరాత్‌లోని బార్డోలీ ప్రాంత రైతాంగం మీద బ్రిటిష్ పాలకులు విధించిన పన్నులకు వ్యతిరేకంగా సత్యాగ్రహ ఉద్యమాన్ని ఆయన విజయవంతంగా నిర్వహించారు. అప్పుడే అక్కడి ప్రజలు పటేల్‌కు 'సర్దార్' బిరుదు ఇచ్చారు.1916 నుంచీ వల్లభ్ భాయ్ పటేల్ – నెహ్రూలు స్వాతంత్ర్య ఉద్యమంలో భాగంగా ఉన్నారు. అయితే, 1937లో ఇద్దరూ కలిసి గుజరాత్‌లో ఒక వారం రోజులు పర్యటించినప్పుడు వారి మధ్య సాన్నిహిత్యం పెరిగింది.

ఇద్దరూ జట్టుగా పనిచేశారు. పటేల్‌కు మహాత్మా గాంధీ ఒక లేఖ రాస్తూ, '' మీరిద్దరూ కలిసినప్పుడు, మీలో ఎవరు గట్టివారో చెప్పడం కష్టం'' అని వ్యాఖ్యానించారు. తర్వాతి సంవత్సరాల్లో పటేల్ – నెహ్రూల నడుమ ఉద్రిక్తతలు, అపోహలు, అప్పుడప్పుడు పరుష భాషణలు తలెత్తాయి. ఏమైనప్పటికీ, స్నేహం, ఒకరి మీద మరొకరికి ప్రశంసా భావన, పరస్పర విధేయత, గాంధీ పట్ల ఉభయుల విధేయత, స్వాతంత్ర్య పోరాటం పెంచిన బంధం... వాటికంటే బలమైనవి.ఆ తర్వాత స్వాతంత్ర్యం వచ్చింది. సంబరాలు తెచ్చింది. వాటితో పాటే విభజన విషాదాలు ప్రజలు చవిచూశారు.

తాము ఉభయులం ఒకరికొకరుగా ఉండటం ఎంత అదృష్టమో వల్లభ్ భాయ్ పటేల్ – నెహ్రూలు గుర్తించారు. 1950 జనవరిలో గవర్నర్ జనరల్ రాజగోపాలాచారి స్వతంత్ర భారత తొలి దేశాధిపతి పదవీకాలం ముగిసిన అనంతరం దేశానికి తొలి రాష్ట్రపతి అయిన రాజేంద్ర ప్రసాద్ వీరిరువురినీ ప్రస్తావిస్తూ, ''ప్రధాన మంత్రి, ఆయన తొలి సహచరుడైన ఉప ప్రధాన మంత్రి కలిసి దేశాన్ని అన్ని విధాలాసుసంపన్నం చేసే గొప్ప ఆస్తి అయ్యారు. మొదటి వారు సార్వజనీన ప్రేమను, రెండో వారు సార్వజనీన విశ్వాసాన్ని చూరగొన్నారు'' అని చెప్పారు.

కాలం మారుతుంది. గడచిన దశాబ్దాలు మర్చిపోతారు. ఎడతెగని తప్పుడు ప్రచారం జరుగుతుంది. అది ఎంత హాని చెయ్యాలో అంత హాని చేస్తుంది. నెహ్రూ అవమానం పాలయ్యాడు. పటేల్ విగ్రహం ఆకాశాన్ని తాకుతోంది... కానీ, ఆయన జీవితానికి, ఆలోచనకు, ఆయన చేసిన కృషికి సంబంధించిన వాస్తవాలు పాతాళంలోకి వెళుతున్నాయి. ఈ పరిస్థితుల్లో 1940లు, 1950లు ఇంకా గుర్తున్న, పటేల్ – నెహ్రూలు ఉభయులనూ కలిసిన, పటేల్ జీవితాన్ని పరిశోధించి ఆయన జీవిత చరిత్ర రాసిన నాలాంటి వాడు తనకు తెలిసిన వాస్తవాలు ఏమిటో చెప్పితీరాలి.

కాబట్టి, వారిద్దరి మధ్య నడిచిన ఉత్తర ప్రత్యుత్తరాల నుంచి కొన్ని వాక్యాలు ఉటంకించి ఈ వ్యాసం ముగిస్తాను. 1948 ఫిబ్రవరి 3న సర్దార్ పటేల్‌కు నెహ్రూ రాసిన లేఖ నుంచి: ''మనం ఒకరికొకరం సన్నిహితంగా ఉంటూ, ఎన్నో తుపానులనూ, ఇక్కట్లనూ కలసి కట్టుగా ఎదుర్కొని పావు శతాబ్దం గడచిపోయింది. ఈ కాలంలో మీ పట్ల నా గౌరవాభిమానాలు పెరిగాయని పూర్తి నిజాయితీతో చెప్పగలను...''

1948 ఫిబ్రవరి 5న నెహ్రూకు సర్దార్ పటేల్ రాసిన లేఖ నుంచి: ''మనం ఇద్దరం ఒక ఉమ్మడి లక్ష్య సాధనలో జీవితకాల మిత్రులు (కామ్రేడ్స్)గా ఉంటున్నాం. దృక్పథాలు స్వభావాలు విభేదించినా, మన దేశ అత్యున్నత ప్రయోజనాలు, మనకు ఒకరి పట్ల మరొకరికి ఉన్న ప్రేమాభిమానాలు వాటిని అధిగమించేలా చేస్తూ మనల్ని కలిపి ఉంచుతున్నాయి.''




# రాచాల పాదయాత్రలో కిక్కిరిసిన జనం..

- శ్రీరంగాపూర్ మండలాన్ని అభివృద్ధి చేయండి...
- డిగ్రీ కళాశాల మరియు 30 పడకల ఆసుపత్రి ఏర్పాటు చేయాలి...
- రంగనాయక స్వామి ఆలయానికి పర్యాటక శోభ కల్పించండి...
- రాష్ట్ర ప్రభుత్వానికి రాచాల విజ్ఞప్తి...
- ప్రజల సమస్యలను వింటూ ముందుకు సాగిన రాచాల పాదయాత్ర..

**వనపర్తి బ్యూరో సిటీ టైమ్స్ ఏప్రిల్ 19**

అభివృద్ధికి నోచుకోని శ్రీరంగాపూర్ మండలాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేయాలని బీసీ పొలిటికల్ జెఎసి స్టేట్ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.శుక్రవారం శ్రీరంగాపూర్ మండల కేంద్రంలో నిర్వహించిన రాచాల మార్నింగ్ వాక్ కార్యక్రమానికి ప్రజలు ఉప్పెనలా తరలివచ్చారు.ఉదయం మండల కేంద్రానికి చేరుకున్న రాచాలకు నాయకులు డప్పు చప్పుళ్ళతో స్వాగతం పలికారు.పోచమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం మహాత్మా జ్యోతి రావు పూలే, అంబేద్కర్, భగీరథ, వాల్మీకి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించి, స్థానిక ప్రజలతో కలిసి వారి సమస్యలు తెలుసుకుంటూ గ్రామంలోని అన్ని వార్డులలో నడక సాగించి రంగనాయక స్వామి ఆలయంలో ముగించారు.

ఈ సందర్భంగా రాచాల మాట్లాడుతూ మండల కార్యాలయాలు లేక ప్రజలు, ఉద్యో గులు చాలా ఇబ్బందులకు గురవుతున్నారని, వెంటనే వాటిని నిర్మించాలన్నారు. మండల కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల మరియు 30 పడకల ఆసుపత్రి ఏర్పాటు చేయాలని కోరారు.రంగ సముద్రం కట్ట కింద నివాసం ఉంటున్న ప్రజలు వర్షాకాలం భయంతో జీవిస్తున్నారని, ఊట నీరు ఇండ్లలోకి రావటంతో ఇండ్లు మెత్తబడి కూలిపోయే ప్రమాదం ఉందని, ప్రభుత్వం వెంటనే స్పందించి వారికి మరోచోట పునరావాసం కల్పించి ఆదుకోవాలని కోరారు.
మండల కేంద్రంలో బస్టాండు లేకపోవడంతో ప్రజలు ఎండకు, వర్షానికి రోడ్డుమీద నిలబడి బస్సుల కోసం ఎదురుచూడాల్సిన దుస్థితి ఉందని, ప్రయాణికుల సౌకర్యార్థం బస్టాండు నిర్మించాలని లేనిపక్షంలో కనీసం బస్ షెల్టర్లు ఏర్పాటు చేయాలని, అదేవిధంగా మండల కేంద్రంలో పబ్లిక్ టాయిలెట్స్ ఏర్పాటు చేయాలని కోరారు. వందల ఏళ్ల చరిత్ర.. సంస్థానాదీశుల కాలంనాటి ఆలయాలకు పర్యాటక శోభ ప్రతిపాదనలకే పరిమితమవుతోందన్నారు. స్థానిక ఎమ్మెల్యే గారు ప్రత్యేక చొరవ తీసుకుని ప్రసిద్ధిగాంచిన శ్రీ రంగనాయక స్వామి ఆలయం అభివృద్ధి, టూరిజం అభివృద్ధిపై దృష్టి సారించి, ఈప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీరంగాపూర్ మండల అద్యక్షులు ధర్మేంద్ర సాగర్, ప్రధాన కార్యదర్శి అస్కని రమేష్, నాయకులు పాండురంగ యాదవ్, వివి గౌడ్, రాఘవేందర్, మహీందర్ నాయుడు, దేవర శివ, గుంటి రవి, రాజేష్, రవి నాయుడు,బీసన్న, సుమన్, ప్రవీణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.




# 42 శాతం రిజర్వేషన్ల బిల్లు ఆమోదం పొందిన తర్వాతే ఉద్యోగ నోటిఫికేషన్ లను విడుదల చెయ్యాలి..

- బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు మోడల శ్రీనివాస్ సాగర్...

**వనపర్తి బ్యూరో సిటీ టైమ్స్ ఏప్రిల్ 18**



42శాతం బీసీ రిజర్వేషన్ బిల్లుకు చట్టబద్ధత వచ్చిన తర్వాతనే ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వాలి..బీసీ సమాజ్ ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా అధ్యక్షుడు మోడల శ్రీనివాస్ సాగర్ డిమాండ్
42 శాతం బీసీ రిజర్వేషన్ల బిల్లుకు సంబంధించి చట్టబద్ధత వచ్చిన తర్వాతనే ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇచ్చి భర్తీ చేయాలని, అప్పుడే బీసీ విద్యార్థులకు మేలు జరుగుతుందని బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎం శ్రీనివాససాగర్ డిమాండ్ చేశాడు.. బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా కార్యాలయంలో మాట్లాడుతూ రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ పూర్తయింది కాబట్టి ఇక ఉద్యోగ నోటిఫికేషన్లకు తెర లేపడం జరిగిందని ఈ నెలాఖరులోగా అన్ని రకాల ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదలవుతాయని ప్రభుత్వ వర్గాలు తెలియజేస్తున్నారని ఆయన అన్నారు..ఎస్సీ వర్గీకరణ పూర్తి చేయడం జరిగింది కానీ ఇటీవల బీసీ వర్గాలకు కేటాయించిన 42 శాతం రిజర్వేషన్ సంగతి ఏంటి? కేంద్ర ప్రభుత్వం నుంచి గాని రాష్ట్రపతి నుండి గాని ఇంతవరకు ఎలాంటి సానుకూలత రాలేదని మాట్లాడుతూ ఎందుకు బీసీల పట్ల, బీసీ నిరుద్యోగుల పట్ల ఇంత వివక్షత ఎందుకు చూపుతున్నారో అర్థం కావడం లేదన్నారు..గతంలో టిఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రపతి ఉత్తర్వులు ఆలస్యమవుతున్నాయని G.O. MS No.33 తేదీ 30.09.2022 తెచ్చిన విషయం తెలిసిందే అని దీని ద్వారా ఎస్టీ రిజర్వేషన్ ను 6% నుండి 10% కు పెంచారు. దీంతో అప్పుడు ఎస్సీ, ఎస్టీ, బీసీ సామాజిక రిజర్వేషన్లు 50% నుండి 54% చేరాయి. గతంలో ఇందిరా సహాని కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు మేరకు 50% కోటాకు మించి ఉందని కొందరు కోర్టులను ఆశ్రయించారు కూడా కానీ అది ఇంతవరకు ఏమి తేలలేదు. అయినప్పటికీ అదే జీవో మీద ఇప్పటికే తెలంగాణలో అనేక ఉద్యోగాలు భర్తీ కూడా అయ్యాయి అని శ్రీనివాస్ సాగర్ తెలిపారు..రాష్ట్ర ప్రభుత్వాలు తెచ్చిన బిల్లులు గవర్నర్ ఆమోదానికి గాని, రాష్ట్రపతి ఆమోదానికి గాని పంపిస్తే మూడు నెలల్లో ఎలాంటి సంకేతాలు రాకపోతే అవి అమలు అవుతాయని ఇటీవల సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ తీర్పు మేరకు ఇటీవల తమిళనాడు ప్రభుత్వం గవర్నర్ ఆమోదం లేకుండానే 10 బిల్లులకు గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చిందనీ ఆయన గుర్తు చేశారు..
ఈ పరిస్థితులలో ఎస్సీ వర్గీకరణ పూర్తయింది ఇక రిజర్వేషన్ల సమస్య పూర్తయింది అన్నట్లుగా ప్రభుత్వం భావించి కొత్త ఉద్యోగం నోటిఫికేషన్లు విడుదల చేయడానికి సిద్ధమవుతుంది. కానీ బీసీలకు పెంచిన రిజర్వేషన్ 42% కు చట్టబద్ధత కల్పించిన తర్వాతనే కొత్త ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వాలని బీసీ సంఘాలు నిరుద్యోగులు కోరుతున్నారు లేని పక్షంలో బీసీ విద్యార్థులు, నిరుద్యోగులతో రాష్ట్ర వ్యాప్త ఉద్యమాలకు సిద్ధమవుతామన్నారు..

# మే డే ను జయప్రదం చేయండి

- సిపిఎం జిల్లా కార్యదర్శి మోకు కనకా రెడ్డి

**పాలకుర్తి, ఏప్రిల్ 18, (సిటీ టైమ్స్).**

మే ఒకటో తారీకు నాడు ప్రపంచ కార్మిక దినోత్సవం మేడే కార్యక్రమంలో భాగంగా పాలకుర్తి మండల కేంద్రంలోని అన్ని గ్రామాలలో సిపిఎం సిఐటియు జెండాలు ఆవిష్కరించాలని మేడే కార్యక్రమంలో కార్మికులు, రైతాంగం, కూలీలు, ప్రజలందరూ పాల్గొని మేడే ను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి మోకు కనకా రెడ్డి పిలుపునిచ్చారు
గురువారం పాలకుర్తి మండల కేంద్రంలోని తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు ఐలమ్మ స్మారక భవనంలో సిపిఎం మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సిపిఎం మండల కమిటీ సభ్యులు ఎదునూరి మదార్ అధ్యక్షత వహించగా. కనకా రెడ్డి పాల్గొని మాట్లాడుతూ ప్రజా ఉద్యమాలకు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి పురుడు పోసిన పాలకుర్తి నియోజకవర్గ కేంద్రంలో మేడే కార్యక్రమం ఉత్సాహంగా నిర్వహించాలన్నారు. పాలకుర్తి నియోజకవర్గం కమ్యూనిస్టు ఉద్యమానికి పుట్టిన ఊరుగా ఉందన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో ఈ ప్రాంత ప్రజలు ప్రతి ఒక్కరూ ఎర్రజెండా చేత పట్టుకొని నైజాం పాలనకు వ్యతిరేకంగా ఉద్యమించారన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మికుల హక్కులను కార్మికులు సాధించుకున్న ఎనిమిది గంటల పని దినాన్ని తుంగలో తొక్కి కార్పోరేట్ శక్తులకు ఊడిగం చేసే విధంగా నినాదాలు చేస్తూ. నాలుగు లేబర్ కోడ్లు తీసుకొచ్చి కార్మికుల హక్కుల్ని కాలరాస్తున్నారని. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తూ. మరోవైపు ధరలు విపరీతంగా పెంచి పేద ప్రజలపై భారాలు వేస్తున్నారని. రైతులకు గిట్టుబాటు ధర లేకపోవడం. దళితులకు. గిరిజనులకు రక్షణ లేకుండా కేంద్ర ప్రభుత్వం పాలన నిరసిస్తూ దేశవ్యాప్తంగా మేడే కార్యక్రమం నిర్వహిస్తుందని ఈ కార్యక్రమంలో ప్రజలు కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సింగారపు రమేష్, జిల్లా కమిటీ సభ్యులు చిట్యాల సోమన్న, మండల కార్యదర్శి మాచర్ల సారయ్య, కమిటీ సభ్యులు సోమసత్యం, ముస్కు ఇంద్రారెడ్డి, బెల్లి సంపత్, బాణాల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



# 193మందికి కల్యాణ లక్ష్మీ షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ

- లబ్ధిదారులకు అందజేసిన పిఎసి ఛైర్మన్ ఆరెకపూడి గాంధీ

**శేరిలింగంపల్లి, సిటీటైమ్స్:**



పేదల సంక్షేమమే ధ్యేయంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేదల పక్షపాతిగా పేదింటి ఆడ బిడ్డకు పెద్ద అన్నలాగా నిలుస్తున్నారు అని పిఎసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ కొనియాడారు. శుక్రవారం కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్ పథకం ద్వారా మంజూరైన 193 మంది లబ్ధిదారులకు రూ.1.93 కోట్ల ఆర్థిక సహాయాన్ని చెక్కుల రూపేణ లబ్ధిదారులకు మియాపూర్ లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కార్పొరేటర్లు ఉప్పలపాటి శ్రీకాంత్, మంజుల రఘునాథ్ రెడ్డి, నార్నె శ్రీనివాసరావులతో కలిసి పిఎసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ.. ఈ రోజు 193మంది లబ్దిదారులకు కల్యాణ లక్ష్మీ షాది ముబారక్ చెక్కులు అందచేయడం చాలా సంతోషకరమైన విషయం అన్నారు. నిరుపేదల ఆడ బిడ్డల పెళ్లికి దేశంలో ఎక్కడా లేని విధంగా ,మానవతా దృక్పథంతో కల్యాణ లక్ష్మీ షాదీ ముబారక్ పథకం ప్రవేశ పెట్టడం జరిగినది అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని, పేదింటి వారి ఇండ్లలో సంతోషంతో ఆడపిల్లల పెండ్లి జరగాలని సదుద్దేశంతో కల్యాణ లక్ష్మీ షాదీ ముబారక్ పథకం ఎంతగానో ఉపయోగపడుతుంది అని పిఎసి చైర్మన్ గాంధీ కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్లు, మాజీ కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# పీడిత వర్గాల విముక్తిదాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్

- డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహావిష్కరణ కర్తగా సామాజిక ఉద్యమల పితామహుడు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ.

**వనపర్తి టౌన్ సిటీ టైమ్స్ ఏప్రిల్ 18**

ఈనెల 23న వనపర్తి జిల్లా పర్యటన గోపన్ పేట మరియు ఆత్మకూరు పట్టణానికి డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్, మరియు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహష్కరణలకు మందకృష్ణ మాదిగ రాక కొమ్ము చెన్నకేశవులు మాదిగ ఎమ్మార్పీఎస్ వనపర్తి జిల్లా అధ్యక్షులు వనపర్తి జిల్లా లోని మదనాపురం మండలం గోపన్ పేట గ్రామంలో ఈనెల 23న మధ్యాహ్నం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహావిష్కరణకు పద్మశ్రీ మందా కృష్ణ మాదిగ డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహావిష్కరణ మహోత్సవ ఆహ్వాన పత్రిక పోస్టర్ విడుదల చేసిన ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల వనపర్తి జిల్లా కేంద్రంలో పాలిటెక్నిక్ కళాశాల ముందు ఆవిష్కరించడం జరిగింది.
ఈ విగ్రహావిష్కరణ కు,ముఖ్యఅతిథిగా విగ్రహావిష్కరణ కర్తగా వృద్ధుల వితంతువుల ఆశాజ్యోతి వికలాంగుల ఆత్మబంధువు మాదిగల మహాత్ముడు , ఎస్సీ వర్గీకరణ సాధకుడు ఆరోగ్యశ్రీ స్ఫూర్తిదాత సామాజిక ఉద్యమాల పితామహుడు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ మందాకృష్ణ మాదిగ పాల్గొంటున్నారు కావున వనపర్తి జిల్లా లోని ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల నాయకులు దళిత సంఘం నాయకులు జర్నలిస్టులు, కళాకారులు, మేధావులు, ప్రజాస్వామ్యవాదులు అంబేద్కర్ వాదులు కులసంఘల నాయకులు మరియు ప్రజా సంఘాలు అందరికీ ఆహ్వానం పలుకుతూ పిలుపునిస్తున్నాము. ఈ కార్యక్రమంలో గంధం గట్టయ్య మాదిగ,ఎమ్మార్పీఎస్ జిల్లా అనుబంధ సంఘాల సమన్వయకర్త గద్వాల కృష్ణ మాదిగ,ఎం ఈ ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షులు గంధం నాగరాజు మాదిగ,ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటర్ సభ్యులు రాజారాం ప్రకాష్,ప్రజావాగ్దేయకారుడు గోవింద్,కుల సమానతల నిర్మూలన పోరాట సమితి వనపర్తి జిల్లా కన్వీనర్ అంబేద్కర్ విగ్ర ఆవిష్కరణ నిర్వాహకులుచిన్న వెంకటేష్ మాదిగ,శ్రీరాములు,ఆంజనేయులు,కొండన్న,గంధం లక్ష్మయ్య,వి హెచ్ పి ఎస్ నాయకులు శ్రీనివాసులు,వి హెచ్ పి ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# వ్యాయామం పోలీసులకు ఆత్మ రక్షణ కవచం

**జిల్లా ఎస్పీరావుల గిరిధర్ ఐపీఎస్**

- ఆరోగ్యంగా ఉంటేనే శాంతి భద్రతలు సాధ్యం
- వ్యాయామశాలను ప్రారంభించిన ఎస్పీ

**వనపర్తి క్రైమ్ సిటీ టైమ్స్ ఏప్రిల్ 18**



వ్యాయామం పోలీసులకు ఆత్మ రక్షణ కవచంగా ఉంటుందని ప్రతి ఒక్కరు ప్రతిరోజు వీలున్న సమయంలో వ్యాయామం చేయడం తప్పనిసరిగా అలవాటు చేసుకోవాలని వనపర్తి జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు.
శుక్రవారం రోజు జిల్లా పోలీసు సాయుధ దళ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నూతనంగా వ్యాయామ శాలను రావుల గిరిధర్ ఐపిఎస్ ప్రారంభించారు.
ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... జిల్లాలోని వివిధ పోలీసుశాఖలో పనిచేస్తున్న పోలీసు అధికారులు, సిబ్బందితో పాటు వ్యాయామం చేశారు, వ్యాయామంలో ముఖ్యమైన పరికరాలు ప్రస్తుతం అందుబాటులో లేకపోయినప్పటికీ త్వరలోనే జిల్లా సాయుధ దళం కార్యాలయంలో అధునాతన వ్యాయామ పరికరాలు పరికరాలతో జిల్లాలోని పోలీసులు ఉదయం సాయంత్రం వేళల్లో వ్యాయామం చేసి ఆరోగ్యంగా ఆరోగ్యవంతమైన పోలీసుగా ప్రజలకు భరోసా కల్పిస్తూ బాధ్యతగా నిలువాల్సిన అవశ్యకత ఎంతైనా ఉందని ఆయన అన్నారు. వ్యాయామం లేని మానవుడు ఈ సమాజంలో అనేక రోగాల బారిన పడుతూ చిన్నతనంలోనే షుగర్ బీపీ, థైరాయిడ్, రకరకాల వ్యాధులతో మానవుని జీవితం ప్రశ్నార్థకంగా మారుతున్న ఈ తరుణంలో ప్రతి ఒక్కరు వ్యాయామం పైన శ్రద్ధ పెట్టాలని ఎస్పి సూచించారు, పోలీసులతో పాటు సామాన్య ప్రజలు కూడా తమకు అందుబాటులో ఉన్న పరికరాలతో పాటు మార్నింగ్ వాకింగ్ ఈవెనింగ్ వాకింగ్ ముఖ్యమని అన్నారు. అంతేకాక మహిళలకు ప్రధానంగా ఆత్మ రక్షణ విద్య ఎంతో దోహదపడుతుందని మహిళలు చిన్ననాటి నుంచే కరాటే శిక్షణలో శిక్షణ పొందుతూ ఆత్మరక్షణ విద్యలు నిష్ణాతులై ఉండాలని శత్రువులను ఎదుర్కోవడానికి ఆత్మరక్షణ విద్య మహిళలకు ఎంతో దోహదపడుతుందని ఎస్పీఅన్నారు, వనపర్తి జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వ్యాయామ పరికరాలు అందుబాటులో ఉంటాయని ఏఆర్ పోలీసులతోపాటు సివిల్ పోలీసులు ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎస్పీ అన్నారు, ఈ కార్యక్రమంలో రిజర్వ్ఇన్స్పెక్టర్,అప్పలనాయుడు,రిజర్వ్ సబ్ ఇన్స్పెక్టర్, మగ్దూం భారీ, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




# కాంగ్రెస్ లోకి మాజీ సర్పంచ్ రాజేష్ నాయక్?

- అదే బాటలో డాక్టర్ సోమేశ్వరరావు?
- పాలకుర్తిలో బీటలు వారుతున్న బీఆర్ఎస్ కోట

**పాలకుర్తి, ఏప్రిల్ 18 (సిటీ టైమ్స్).**



పాలకుర్తి నియోజకవర్గంలో బీఆర్ఎస్ కోటకు బీటలు వారుతున్నాయా?... గులాబీ పార్టీ కీలక నాయకులు పార్టీ మారబోతున్నారా?.... మాజీ మంత్రి ఎర్రబెల్లికి కుడి భుజంగా ఉన్న నాయకులు కారు దిగుతున్నారా? అనే ప్రశ్నలకు అవుననే సమాధానాలు వినిపిస్తున్నాయి. రాష్ట్ర మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ముఖ్య అనుచరులు, తొర్రూరు మేజర్ గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ డాక్టర్ ధరావత్ రాజేష్ నాయక్, బీఆర్ఎస్ పార్టీ మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ డాక్టర్ పొనుగోటి సోమేశ్వర రావు లు పార్టీ మారెందుకు రంగం సిద్ధమైనట్లు తెలుస్తోంది. అతిత్వరలో కాంగ్రెస్ లో చేరేందుకు వారు నిర్ణయించుకున్నట్లు తెలిసింది. దీంతో పాలకుర్తి నియోజకవర్గం లో పాలిటిక్స్ కొత్త రూపు సంతరించుకోనుంది. పాలకుర్తి నియోజకవర్గం లో బీఆర్ఎస్ కు ఆయువు పట్టుగా ఉన్న తొర్రూరు ఒక్కొక్కరు కారు దిగి హస్తం పార్టీకి దగ్గరవుతున్నారు. ఇప్పుడు ఏకంగా మాజీ సర్పంచ్ రాజేష్ నాయక్, డాక్టర్ సోమేశ్వరరావు లు బీఆర్ఎస్ ను వీడుతుండటం ఆ పార్టీలో కలకలం రేపుతోంది. పార్టీ మారుతున్న విషయం సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం జరుగుతుంది. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి దయాకర్ రావు వారితో మాట్లాడి బుజ్జగించేందుకు ప్రయత్నించినట్లు సమాచారం. కానీ వారు బీ ఆర్ఎస్ లో కొనసాగేందుకు సుముఖంగా లేమని తేల్చినట్లు తెలుస్తోంది.

డాక్టర్ రాజేష్ నాయక్ తొర్రూరు మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ గా కొనసాగి దయాకర్ రావు ముఖ్య అనుచరునిగా పేరుందారు. ఆయన సహకారంతో దయాకర్ రావుకు గిరిజన, లంబాడా ప్రాంతాల్లో మంచి మద్దతు లభించింది. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పీహెచ్ డీ పూర్తి చేసిన రాజేష్ నాయక్ తెలంగాణ ఉద్యమ సమయంలో ఓయూ జెఏసి చైర్మన్ గా వ్యవహరించి ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్షను రగిలించారు. ఎన్నో సామాజిక ఉద్యమాల్లో ప్రధాన భూమిక పోషించారు. తదనంతరం నవ తెలంగాణ పార్టీ పొలిట్ బ్యూరో సభ్యునిగా సైతం కొనసాగారు. డాక్టర్ సోమేశ్వర రావు సైతం దయాకర్ రావుకు నమ్మిన బంటుగా రాజకీయాల్లో ఆయన వెన్ను తట్టారు.

ప్రతి ఎన్నికల్లో దయన్న గెలుపుకు కాలికి బలపం కట్టుకొని తిరిగి ప్రచారం చేశారు. గెలిచేంతవరకే నాయకులను దగ్గర ఉంచుకొని గెలిచాక ఆయనను పూర్తిగా విస్మరించాడనే ప్రచారం ప్రజల్లో ఉంది. ఆయన స్థాయికి తగ్గ పదవీ, గౌరవం ఇవ్వలేదని ప్రజల్లో భావన ఉంది. అనామకులకు కీలక బాధ్యతలు, పదవులు అప్పగించిన ఎర్రబెల్లి సోమేశ్వరరావుకు ఏ పదవి ఇవ్వడానికి ఇష్టపడ లేదని ప్రచారం జరిగింది. గత కొంతకాలంగా డాక్టర్ రాజేష్ నాయక్, డాక్టర్ సోమేశ్వర రావులు బీఆర్ఎస్ కార్యకలాపాలకు దూరంగా ఉంటున్నారు. ఈ సమయంలో పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జి ఝాన్సీ రెడ్డిలు వీరి ప్రాధాన్యతను గుర్తించి పార్టీలోకి ఆహ్వానించినట్లు తెలుస్తోంది. ఇదే నిజమైతే బీఆర్ఎస్ పార్టీలో చేరికల పర్వం మరింత పెరిగే అవకాశం ఉంటుంది. ప్రజా బలం ఉన్న ఈ నాయకులతో హస్తం పార్టీకి లాభం చేకూరే అవకాశం ఉంటుందని స్థానిక నాయకులు, రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.



# ప్రతీ నియోజకవర్గంలో రూ.20లక్షలతో చేపల మార్కెట్లు నిర్మించాలి

- దేశ వ్యాప్తంగా సంతకాల సేకరణోద్యమం
- మే 15న ఇంద్రపార్క్ వద్ద మత్స్యకారుల మహా ధర్నా
- టిఎంకెఎంకెపస్ రాష్ట్ర అధ్యక్షులు గోరెంకల నర్సింహ్మా పిలుపు

**శేరిలింగంపల్లి,సిటీటైమ్స్:**

ఎన్ సి డి సి, స్కీమ్ ని కొనసాగిస్తూ 90శాతం సబ్సిడీతో మత్స్యకారులకు రుణాలు ఇవ్వాలని, కోహెడలో హోల్ సెల్ రిటైల్ చేపల మార్కెట్ పనులు వెంటనే ప్రారంబించాలని, ప్రతీ నియోజకవర్గంలో రూ.20లక్షలతో చేపల మార్కెట్లు నిర్మించాలని డిమాండ్లతో దేశ వ్యాప్తంగా సంతకాల సేకరణోద్యమం చేపట్టి మే15న ఇందిరాపార్క్ వద్ద మత్స్యకారుల మహాధర్నా కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని టిఎంకెఎంకెఎస్ రాష్ట్ర అధ్యక్షులు గోరెంకల నర్సింహ్మా పిలుపునిచ్చారు. శుక్రవారం శేరిలింగంపల్లి నియోజకవర్గం లోని రాయదుర్గం చెరువు వద్ద మత్స్యకారుల సంతకాల సేకరణోద్యమం నీలం సురేందర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సంతకాల సేకరణోద్యమానికి టిఎంకెఎంకెఎస్ రాష్ట్ర అధ్యక్షులు గోరెంకల నర్సింహ్మా, ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం మత్స్యశాఖ ద్వారా 202526 సంవత్సరానికి గాను జలవనరులలో, చెరువులు కుంటల్లో 100శాతం రాయితీ పై ఉచిత చేప పిల్లల పంపిణికి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్ కేటాయింపు స్పష్టంగా ప్రకటించకపోవడాన్ని తెలంగాణ మత్స్యకారులు మత్స్య కార్మిక సంఘం త్రీవంగ ఖండిస్తుందని అన్నారు. రాష్ట్రంలో ప్రతి మత్స్య సొసైటీ చెరువుకుంటల్లో కావాల్సినంత చేప రొయ్య పిల్లలను ఉచితంగా పంపిణీ చేయడానికి సొసైటీ ఖాతాలో నగదు జమ చేయాలని ఈ ఏడాది బడ్జెట్ ను సవరించి మత్స్య పరిశ్రమ అభివృద్ధి మత్స్యకారుల సంక్షేమానికి 5 వేల కోట్లు రూ, కేటాయించాలని,కోహెడ లో అవుటర్ రింగ్ రోడ్ ప్రక్కన గత ప్రభుత్వం 10 ఎకరాల స్థలం కేటాయించిందని మార్కెట్ నిర్మాణం కోసం 47 కోట్ల రూ.,బడ్జెట్ కేటాయించినప్పటికీ పనులు మాత్రం ప్రారంభించకపోడం శోచనీయం అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా విస్తరిస్తున్న రియల్ ఎస్టేట్ & రాజకీయ బడా బాబుల నుండి చెరువులు కుంటలను రక్షించాలని,మత్స్య మిత్ర మహిళా గ్రూపులను పునరుద్ధరించాలని వాటి అభివృద్ధి కోసం ప్రతి మహిళా సోసైటికి రూ.10లక్షల ఆర్థిక సహాయం చేయాలని, సహజంగా మరణించిన మత్స్యకారులకు రూ.10 లక్షల ఇన్సూరెన్స్, ఎక్స్ గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఏప్రిల్ మే నెలలో రాష్ట్ర వ్యాప్తంగా మత్స్య సహకార సంఘాలు చేపల మార్కెట్లలో మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలపై సర్వేలు అధ్యయనం చేస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలపై మే 15 న మత్స్యకారుల జాతీయ డిమాండ్స్ డే సందర్భంగా ఇందిరా పార్క్ వద్ద మత్స్యకారులతో మహా ధర్నా నిర్వహిస్తున్నామని అందుకే మండల జిల్లా స్థాయిలో ఆందోళన చేస్తూ సర్వేలో వచ్చిన సమస్యలు పరిష్కరించాలని అధికారులకు వినతి పత్రాలు ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టిఎంకెఎంకెఎస్ శేరిలింగంపల్లి నియోజకవర్గం కన్వీనర్ నీలం సురేందర్, రాయదుర్గం ఉపాధ్యక్షులు అంబటి అశోక్ కుమార్, కార్యదర్శి గోరెంకల శ్రీశైలం,నీరుడు శంకర్,ఇడ్ల బిక్షపతి,వీరస్వామి,అది శ్రీశైలం,నక్కలి వెంకటేష్,ఈగ సుగుణ కర్,గోరెంకల శ్రీకాంత్, గోరెంకల సాయి కిరణ్,ఇంద్ల శ్రీరాం,నీరుడు కిరణ్,నీరుడు సాయి,మేకల మహేష్,తదితరులు పాల్గొన్నారు.

# యూపీఐ లావాదేవీలపై జీఎస్టీ?: క్లారిటీ ఇచ్చిన కేంద్రం

**హైదరాబాద్, (సిటీ టైమ్స్):**

యూపీఐ లావాదేవాల మీద ప్రభుత్వం జీఎస్టీ విధించనుందని వస్తున్న వార్తలలో ఎలాంటి నిజం లేదని కేద్రం క్లారిటీ ఇచ్చింది. రూ. 2వేలు కంటే ఎక్కువ లావాదేవీలు జరిగితే 18 శాతం జీఎస్టీ విధిస్తారని ప్రచారమవుతున్న వార్తా అబద్ధమని ఆర్థికమంత్రిత్వ శాఖ ఓ ప్రకటన ద్వారా వెల్లడించింది.

రూ. 2000 కంటే ఎక్కువ యూపీఐ లావాదేవీలు చేస్తే జీఎస్టీ విధిస్తారని కొంతమంది తప్పుదారి పట్టిస్తున్నారు. ప్రభుత్వం డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్రం స్పష్టం చేసింది. యూపీఐ అందుబాటులోకి వచ్చిన తరువాత.. చాలామంది జేబులో డబ్బులు పెట్టుకోవడమే మరచిపోయారు. ప్రతి చిన్న వస్తువు కొనుగోలు చేయాలన్నా.. ఆన్‌లైన్‌లో పే చేస్తున్నారు. ఇలాంటి తరుణంలో లావాదేవీలమీద జీఎస్టీ విధిస్తారని వస్తున్న వార్తలకు ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని కేంద్రం క్లారిటీ ఇచ్చింది.




# రూ.98 వేలు దాటిన బంగారం

**హైదరాబాద్, (సిటీ టైమ్స్):**

బంగారం ధరలు రోజు రోజుకు చుక్కలు చూపిస్తున్నాయి. నాలుగు రోజుల క్రితం వరకు తగ్గుతూ వచ్చిన బంగారం ధరలు ఇప్పుడు మళ్లీ షాకుల మీద షాకులు ఇస్తున్నాయి. సాధారణ ప్రజలు బంగారం కొనాలంటే.. ఉన్న ఆస్తులన్నీ అమ్ముకోవాల్సిన పరిస్థితి నెలకొంది. 24 క్యారెట్ల స్వచ్ఛమైన బంగారం ధర 95 వేలనుంచి లక్ష రూపాయల మధ్య ట్రేడ్ అవుతోంది. దాదాపు ఆరు నెలల కాలంలో బంగారం ధరలు భారీగా పెరిగాయి. 22 క్యారెట్ల గోల్డ్ 60 వేల నుంచి ఏకంగా 85 వేలకు జంప్ కొట్టింది. తగ్గేదేలా అన్నట్లు ముందుకు దూసుకుపోతోంది. నిన్నటితో పోల్చుకుంటే ఈ రోజు బంగారం ధరలు కొద్దిగా పెరిగాయి.





# ఎలాన్ మస్క్‌తో టెక్ సహకారంపై మాట్లాడిన ప్రధాని మోదీ

**హైదరాబాద్, (సిటీ టైమ్స్):**

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం టెస్లా, స్పేస్ ఎక్స్ అధినేత, బిలియనీర్ ఎలాన్ మస్క్‌తో మాట్లాడారు. టెక్నాలజీ, ఆవిష్కరణ రంగాలలో సహకారం గురించి చర్చించారు. దీనికి సంబంధించి పీఎం మోదీ తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు. "ఈ ఏడాది ఆరంభంలో వాషింగ్టన్ డిసిలో జరిగిన మా సమావేశంలో చర్చించిన అంశాలతో సహా వివిధ సమస్యలు, అంశాల గురించి ఎలాన్ మస్క్‌తో మాట్లాడాను. టెక్నాలజీ, ఇన్నోవేషన్స్ రంగాలలో సహకారానికి ఉన్న అపారమైన అవకాశాలపై మేము చర్చించాం" అని మస్క్ యాజమాన్యంలోనే ఉన్న సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ Xలో పీఎం మోదీ పోస్ట్ చేశారు. టెక్నాలజీలో అమెరికాతో ద్వైపాక్షిక భాగస్వామ్యాన్ని ముందుకు తీసుకెళ్లడానికి భారతదేశం కట్టుబడి ఉందని మోదీ అన్నారు.

కాగా, 2030 నాటికి $500 బిలియన్ల వాణిజ్యాన్ని చేరుకోవాలనే లక్ష్యంతో భారత్ అమెరికా ప్రతిష్టాత్మక ఒప్పందంపై చర్చలు జరుపుతున్నాయి. ఎలాన్ మస్క్ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు ప్రముఖ సలహాదారన్న విషయం తెలిసిందే. ఫిబ్రవరిలో భారత ప్రధాని నరేంద్ర మోదీ అమెరికా పర్యటన సందర్భంగా, వాషింగ్టన్‌లో టెస్లా చీఫ్‌ను కలుసుకుని ఇండియాలో టెస్లా స్థాపనకు సంబంధించిన అంశాలతోపాటు సాంకేతికత, నూతన ఆవిష్కరణలకు సంబంధించి వివిధ అంశాలపై చర్చించారు.

ఇలా ఉండగా, ప్రపంచంలోనే ప్రముఖ EV(Electric Vehicle) తయారీదారైన టెస్లా భారతదేశంలోకి ప్రవేశించడానికి రంగం చకచకా సిద్ధమవుతోంది, భారత దిగుమతి విధానాల కారణంగా చాలా కాలంగా మస్క్ ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద ఆటో మార్కెట్ అయిన భారత్‌కు దూరంగా ఉండాల్సి వచ్చింది. అయితే, ఇప్పుడు ఆ కల సాకారం కాబోతోంది. దీంతో పాటు మరిన్ని రంగాల్లో భారత్‌లో పెట్టుబడులు పెట్టేందుకు మస్క్ గ్రూప్ కంపెనీలు సన్నద్ధమవుతుండం భారత్‌కు అనుకూలించే అంశం. ఎలాన్ మస్క్‌కు చెందిన మరో కంపెనీ అయిన స్టార్‌లింక్, ఇటీవల భారత టెలికాం దిగ్గజాలైన రిలయన్స్ జియో, భారతీ ఎయిర్‌టెల్‌తో కలిసి ఇండియాలో ఉపగ్రహ ఇంటర్నెట్ సేవల్ని అందించడానికి ఒప్పందం కుదుర్చుకున్నాయి. అంతేకాకుండా, అమెరికా ఉపాధ్యక్షుడు JD వాన్స్, అతని భార్య ఉష వచ్చే వారం భారతదేశాన్ని సందర్శించనున్నారు. పర్యటనలో భాగంగా కొత్త ట్రేడ్ టారిఫ్ అంశంపై కూడా వాన్స్ భారత ప్రభుత్వంతో చర్చలు జరుపుతారు. ఈ నెల ప్రారంభంలో ట్రంప్ ప్రభుత్వం భారతీయ వస్తువులపై 26% దిగుమతి సుంకాన్ని విధించింది, తర్వాత వాటి అమలును 90 రోజులు నిలిపివేసిన సంగతి తెలిసిందే.

వాణిజ్య ఒప్పందం కింద భారత్ అమెరికాలు రాబోయే వారాల్లోనే రంగాలవారీ చర్చలు జరపనున్నాయి. ఇవి ట్రంప్ సడలించిన 90 రోజుల వ్యవధిలోనే ఒక కొలిక్కి వచ్చే అవకాశం ఉంది. ఒప్పందాల యొక్క నిబంధనలు ఇప్పటికే ఖరారు అయినట్టు తెలుస్తోంది. మరిన్ని చర్చలు ప్రధానంగా వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా కూడా భారత్ అమెరికాల మధ్య జరగనున్నాయి. అటు, భారత బృందం కూడా త్వరలోనే అమెరికాను సందర్శించే అవకాశం కనిపిస్తోంది. అయితే, ట్రేడ్ టారిఫ్స్ ఒప్పందాల్లో ఇరు దేశాల మధ్య జీరో ట్యాక్స్ విధానం అమలు ఉండే అవకాశం లేదు. ఎందుకంటే అటువంటి ప్రణాళిక, సాధారణంగా మరింత అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థలకు పరస్పరం ప్రయోజనకరంగా ఉంటుంది. ఉదాహరణకు యూరోపియన్ యూనియన్ అమెరికా వంటి ఆర్థిక వ్యవస్థలు దీనికి సరిపడతాయికాని, కానీ అది అభివృద్ధి చెందుతోన్న భారతదేశం, అభివృద్ధి చెందిన అమెరికా మధ్య జరిగే అవకాశాలు చాలా తక్కువ




# టారిఫ్ కష్టాల్లో విప్రో

- జూన్ త్రైమాసిక ఆదాయ అంచనా 3.5% తగ్గింపు
- క్యూ4 లాభం రూ.3,569 కోట్లు
- ఆదాయం రూ.22,504 కోట్లకు..

**హైదరాబాద్, (సిటీ టైమ్స్):**

ఐటీ సేవల కంపెనీ విప్రో మార్చి 31తో ముగిసిన 202425 ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికానికి రూ.3,569.6 కోట్ల ఏకీకృత నికర లాభం ఆర్జించింది. వార్షిక ప్రాతిపదికన ఇది 25.9 శాతం అధికం. ఆదాయం మాత్రం స్వల్పంగా పెరిగి రూ.22,504.2 కోట్లుగా నమోదైంది. డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికంతో పోలిస్తే క్యూ4లో నికర లాభం 6.43 శాతం, ఆదా యం 0.83 శాతం పెరిగాయి. కాగా, క్యూ4లో ఒక్కో షేరుపై ఆర్జన (ఈపీఎస్) రూ.3.4గా ఉంది. క్యూ3తో పోలిస్తే ఇది 6.2 శాతం పెరగగా.. వార్షిక ప్రాతిపదికన 25.8 శాతం వృద్ధి నమోదైంది. గడిచిన త్రైమాసికంలో విప్రో ఐటీ సేవల ఆదాయం (స్థిర కరెన్సీ ఆధారిత) అమెరికన్ కరెన్సీలో 259.65 కోట్ల డాలర్లుగా నమోదైంది. క్యూ3తో పోలిస్తే ఇది 1.2 శాతం, వార్షిక ప్రాతిపదికన 2.3 శాతం తగ్గింది. క్యూ4లో నిర్వహణ లాభాల మార్జిన్ వార్షిక ప్రాతిపదికన 1.1 శాతం పెరిగి 17.5 శాతానికి చేరుకుంది. కాగా, 202425 ఆర్థిక సంవత్సరం మొత్తానికి విప్రో నికర లాభం వార్షిక ప్రాతిపదికన 18.9 శాతం పెరిగి రూ.13,135.4 కోట్లకు చేరగా.. ఆదాయం మాత్రం 0.74 శాతం తగ్గి రూ.89,088.4 కోట్లకు పరిమితమైంది.

గత కొన్ని త్రైమాసికాలుగా ఉద్యోగులను తగ్గించుకుంటూ వచ్చిన విప్రో.. క్యూ4లో నికరంగా 614 మందిని చేర్చుకుంది. క్యూ3లో 15.3 శాతంగా నమోదైన ఉద్యోగుల వలసల రేటు 15 శాతానికి తగ్గింది.

మార్చి 31 నాటికి విప్రో ఉద్యోగుల మొత్తం సంఖ్య 2,33,346గా నమోదైంది. 202324 ఆర్థిక సంవత్సరం చివరినాటికి ఉన్న 2,32,614 మందితో పోలిస్తే గడిచిన ఏడాది కాలంలో ఉద్యోగుల సంఖ్య 732 పెరిగింది.

మార్చి త్రైమాసికంలో కంపెనీ 395.5 కోట్ల డాలర్ల ఆర్డర్లను దక్కించుకుంది. గత ఏడాది ఇదే కాలంతో పోల్చితే ఇది 13.4 శాతం అధికం. అందులో బడా డీల్స్ మాత్రం 48.5 శాతం పెరిగి 176.3 కోట్ల డాలర్లుగా నమోదయ్యాయి. 202425 ఆర్థిక సంవత్సరం మొత్తానికి మాత్రం ఆర్డర్లు 3.8 శాతం తగ్గి 1,430 కోట్ల డాలర్లకు పరిమితమయ్యాయి.

ప్రాంగణ నియామకాల ద్వారా గత ఆర్థిక సంవత్సరంలో ప్రణాళిక మేరకు 10,000 మంది వరకు ఫ్రెషర్లను నియమించుకున్నట్లు విప్రో చీఫ్ హ్యూమన్ రిసోర్సెస్ ఆఫీసర్ (సీహెచ్ఆర్ఓ) సౌరభ్ గోవిల్ తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలోనూ ఫ్రెషర్ల నియామకాలు కొనసాగిస్తామన్నారు. ఈ సారి నిర్దిష్ట లక్ష్యమేమీ లేదని తెలిపారు. గతంలో లాగా ఆఫర్ లెటర్లు జారీ చేసి వారిని సంస్థలో చేర్చుకోవడాన్ని వాయిదా వేయకుండా అవసరమైన మేరకు నియామకాలు చేపట్టనున్నట్లు చెప్పారు.

ఈ జనవరి 17న ఒక్కో షేరుకు ప్రకటించిన రూ.6 మధ్యంతర డివిడెండ్‌నే 202425 ఆర్థిక సంవత్సరానికి తుది డివిడెండ్‌గా కూడా పరిగణించనున్నట్లు కంపెనీ స్పష్టం చేసింది.

**క్లయింట్లు ఆచితూచి..**

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జూన్‌తో ముగియనున్న తొలి త్రైమాసికంలో మాత్రం ఐటీ సేవల ఆదాయం 250.5255.7 డాలర్లకు తగ్గవచ్చని కంపెనీ అంచనా వేసింది. 202425 క్యూ4తో పోలిస్తే ఆదాయం 1.5 3.5 శాతం వరకు తగ్గవచ్చని సంస్థ భావిస్తోంది. ట్రంప్ సుంకాల కారణంగా అంతర్జాతీయ ఆర్థిక అనిశ్చితులు పెరగడమే ఇందుకు కారణమని విప్రో సీఈఓ, ఎండీ శ్రీనివాస్ పల్లియా అన్నారు. ''అంతర్జాతీయ ఆర్థిక అనిశ్చితుల నేపథ్యంలో క్లయింట్లు ఐటీ వ్యయాలపై ఆచితూచి నిర్ణయం తీసుకుంటున్నారు. నిలకడైన, లాభదాయక వృద్ధికి కట్టుబడి ఉంటూనే క్లయింట్లకు మరింత చేరువకావడంపై దృష్టిసారించాం'' అన్నారు. ట్రంప్ సుంకాలు వాణిజ్య యుద్ధాలను తీవ్రతరం చేయడంతోపాటు అమెరికా ఆర్థిక వ్యవస్థను మాంద్యంలోకి నెట్టవచ్చన్న భయాలున్నాయి. ఈ పరిణామం అమెరికన్ కంపెనీల ఐటీ వ్యయ నిర్ణయాలపై ప్రభావం చూపవచ్చని, ఐటీ సేవలకు డిమాండ్ తగ్గవచ్చన్న అంచనాలున్నాయి. విప్రోకు అధిక ఆదాయం అమెరికా మార్కెట్ నుంచే సమకూరుతోంది.

# ఇన్ఫోసిస్‌లో 20వేల ఉద్యోగాలు

**హైదరాబాద్, (సిటీ టైమ్స్):**

గూగుల్, మైక్రోసాఫ్ట్ వంటి దిగ్గజ కంపెనీలు తమ ఉద్యోగుల సంఖ్యను తగ్గించుకుంటున్న సమయంలో.. ప్రముఖ టెక్ సంస్థ ఇన్ఫోసిస్ మాత్రం కొత్త ఉద్యోగాలను కల్పించనున్నట్టు ప్రకటించింది. ఈ ఆర్థిక సంవత్సరంలో 20,000 మందికి పైగా ఫ్రెషర్లను నియమించుకోవాలని యోచిస్తోంది.

ఇన్ఫోసిస్ ఉద్యోగుల వేతనాల పెంపుకు సంబంధించిన ఒక అప్డేట్ గురించి, విలేకర్ల సమావేశంలో సంస్థ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ 'జయేష్ సంఘ్రాజ్కా' మాట్లాడుతూ.. ఎక్కువ మందికి జనవరిలోనే జీతాల పెంపు జరిగింది. మిగిలినవారికి జీతాల పెంపు ఏప్రిల్ 1 నుంచి అమలు చేస్తున్నట్లు వెల్లడించారు.

ఇన్ఫోసిస్‌లోని చాలా మంది ఉద్యోగుల జీతాల పెంపు సగటున 58 శాతం వరకు ఉంటుంది. ఇది గడచిన సంవత్సరాలతో పోలిస్తే చాలా తక్కువ. అయితే కంపెనీలు అత్యుత్తమ పనితీరును కనపరచిన ఉద్యోగులకు జీతం 1012 శాతం పెంచినట్లు సమాచారం.

**నియామకాల అంచనా**

జీతాల పెంపు గురించి మాత్రమే కాకుండా.. ఉద్యోగ నియామకాలను గురించి కూడా ఇన్ఫోసిస్ సిఎఫ్ఓ జయేష్ సంఘ్రాజ్కా వెల్లడించారు. భారతదేశంలోని రెండవ అతిపెద్ద ఐటీ సంస్థ ఈ ఆర్థిక సంవత్సరంలో 20,000 మందికి పైగా ఫ్రెషర్లను నియమించుకోవాలని యోచిస్తోందని స్పష్టం చేశారు. 2025 ఆర్థిక సంవత్సరంలో ఇన్ఫోసిస్ 6,388 మంది ఉద్యోగులను నియమించుకుంది. దీంతో మొత్తం ఉద్యోగుల సంఖ్య 323,578కి చేరుకుంది.

**ఇన్ఫోసిస్ క్యూ4 ఫలితాలు**

గతేడాది(2024-25) చివరి త్రైమాసికంలో సాఫ్ట్‌వేర్ సేవల దిగ్గజం ఇన్ఫోసిస్ పనితీరు నిరాశ పరచింది. జనవరి-మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 12 శాతం క్షీణించి రూ. 7,033 కోట్లకు పరిమితమైంది. 2023-24 ఇదే కాలంలో రూ. 7,969 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం మాత్రం 8 శాతం ఎగసి రూ. 40,925 కోట్లకు చేరింది. అంతక్రితం క్యూ4లో రూ. 37,923 కోట్ల టర్నోవర్ సాధించింది.

అయితే త్రైమాసికవారీగా(క్యూ3) చూస్తే నికర లాభం 3.3 శాతం పుంజుకోగా.. ఆదాయం 2 శాతం నీరసించింది. కాగా.. పూర్తి ఏడాదికి నికర లాభం 2 శాతం వృద్ధితో రూ. 26,713 కోట్లను తాకింది. మొత్తం ఆదాయం 6 శాతం పెరిగి రూ. 1,62,990 కోట్లకు చేరింది. వెరసి గత ఆదాయ గైడెన్స్ 4.5-5 శాతాన్ని అధిగమించింది. అతిపెద్ద కాంట్రాక్ట్‌తో కలిపి గతేడాది 11.6 బిలియన్ డాలర్ల విలువైన ఆర్డర్లు సాధించింది. వీటిలో 56 శాతం కొత్త ఆర్డర్లే!







# పంజాబ్ కింగ్స్ జయభేరి

కింగ్స్‌ను విజేతగా నిలబెట్టింది. శుక్రవారం జరిగిన ఈ పోరులో శ్రేయస్ అయ్యర్ సారథ్యంలోని పంజాబ్ కింగ్స్ 5 వికెట్ల తేడాతో ఆర్‌సీబీపై గెలిచింది. మొదట బ్యాటింగ్‌కు దిగిన బెంగళూరు నిర్ణీత 14 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 95 పరుగులు చేసింది. టిమ్ డేవిడ్ (26 బంతుల్లో 50; 5 ఫోర్లు, 3 సిక్స్‌లు) ఒక్కడే మెరిపించాడు. పంజాబ్ బౌలర్లలో అర్ష్ దీప్ , మార్కో యాన్సెన్, యజువేంద్ర చహల్, హర్‌ప్రీత్ బ్రార్ తలా 2 వికెట్లు తీశారు.

అనంతరం లక్ష్యఛేదనకు దిగిన పంజాబ్ 12.1 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 98 పరుగులు చేసి గెలిచింది. నేహల్ వధేరా (19 బంతుల్లో 33 నాటౌట్; 3 ఫోర్లు, 3 సిక్స్‌లు) ధాటిగా ఆడాడు. హాజల్‌వుడ్ 3, భువనేశ్వర్ 2 వికెట్లు తీశారు. బెంగళూరు తమ తుదిజట్టును మార్చలేదు. పంజాబ్ మాత్రం రెండు మార్పులు చేసింది. మ్యాక్స్‌వెల్, సుర్యాంశ్ షెడ్గే స్థానాల్లో స్టొయినిస్, హర్‌ప్రీత్ బ్రార్ బరిలోకి దిగారు.

**అందరూ తొందరగానే...**

వర్షం వల్ల మ్యాచ్ చాలా ఆలస్యంగా ఆరంభమైంది. దీంతో మ్యాచ్‌ను 14 ఓవర్లకు కుదించారు. కోహ్లి, సాల్ట్, లివింగ్‌స్టోన్‌లాంటి హిట్టర్లున్న జట్టులో ఏ నలుగురో, ఐదుగురో ఆడాల్సిన 14 ఓవర్లను ఏకంగా 11 మంది ఆడేశారు. టాపార్డర్, మిడిలార్డర్, లోయర్ ఆర్డర్ అందరూ తొందర, తొందరగా వికెట్లను పారేసుకోవడంతో ఈ పరిస్థితి వచ్చింది. సాల్ట్ (4), కోహ్లి (1), రజత్ పాటీదార్ (23), లివింగ్‌స్టోన్ (4), జితేశ్ శర్మ (2), కృనాల్ పాండ్యా (1) చేతులెత్తేశారు.

**డేవిడ్ ఒక్కడి మెరుపులతోనే...**

జట్టు స్కోరు 95/9. అంటే 11 మంది క్రీజులోకి వచ్చారన్నమాటే! అందరూ బ్యాటింగ్‌కు దిగినా... స్కోరులో సగంకంటే ఎక్కువ స్కోరు ఒక్కడే టిమ్ డేవిడ్ చేశాడు. ఏడో వరుసలో, ఏడో ఓవర్లో బ్యాటింగ్‌కు వచ్చిన డేవిడ్ అండగా నిలిచేవారే కరువైనా... ఆఖరి రెండు ఓవర్లలోనే అంతా మార్చాడు. 12 ఓవర్లలో బెంగళూరు 9 వికెట్లకు 63 పరుగులు చేసింది. డేవిడ్ స్కోరు 19 కాగా... జేవియర్ 13వ ఓవర్లో 2 బౌండరీలు సహా 11 పరుగులు చేశాడు.

**ఇన్నింగ్స్ బ్రేక్‌కు ముందు...**

చివరి 14వ ఓవర్లో తొలి మూడు బంతులు వరుసగా... 0, 0, 0 పరుగే రాలేదు. తర్వాత మూడు బంతుల్ని డేవిడ్ భారీ సిక్సర్లు బాదడంతో 18 పరుగులొచ్చాయి. 48 పరుగులు చేసిన డేవిడ్ సహా అంతా ఇన్నింగ్స్ బ్రేక్ కావడంతో మైదానం వీడుతున్నారు. కానీ అంపైర్ చాలా ఆలస్యంగా నోబాల్ సిగ్నలిచ్చాడు. సహచరులతో కబుర్లాడుతూ డగౌట్ చేరుతున్న ఆటగాళ్లను వెనక్కి పిలిచి ఫ్రీ హిట్ ఆడించడంతో 2 పరుగులు తీసిన డేవిడ్ 26 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తిచేసుకున్నాడు. సులువైన లక్ష్యం కావడంతో పంజాబ్‌కు ఛేదనలో పెద్దగా కష్టం ఎదురవలేదు. ఓపెనర్లు ప్రియాన్ష్ ఆర్య (16), ప్రభ్‌సిమ్రాన్ (13), కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (7) ఇలా టాపార్డర్ వికెట్లు రాలినా... మిడిలార్డర్‌లో నేహల్ భారీ షాట్లతో విరుచుకు పడి జట్టును గెలిపించాడు. దీంతో ఒకే ఓవర్లో హాజల్‌వుడ్ అయ్యర్, ఇన్‌గ్లిస్ (14) వికెట్లను పడగొట్టినా... నేహల్ బ్యాటింగ్ బెంగళూరును మ్యాచ్‌లో పట్టుబిగించకుండా చేసింది. 11 బంతులు మిగిలుండగానే పంజాబ్ విజయాన్ని అందుకుంది.

**స్కోరు వివరాలు**

రాయల్ చాలెంజర్స్ బెంగళూరు ఇన్నింగ్స్: సాల్ట్ (సి) ఇన్‌గ్లిస్ (బి) అర్ష్ దీప్ 4; కోహ్లి (సి) యాన్సెన్ (బి) అర్ష్ దీప్ 1; పాటీదార్ (సి) జేవియర్ (బి) చహల్ 23; లివింగ్‌స్టోన్ (సి) ప్రియాన్ష్ (బి) జేవియర్ 4; జితేశ్ (సి) నేహల్ (బి) చహల్ 2; కృనాల్ (సి అండ్ బి) యాన్సెన్ 1; టిమ్ డేవిడ్ (నాటౌట్) 50; మనోజ్ (ఎల్బీడబ్ల్యూ) (బి) యాన్సెన్ 1; భువనేశ్వర్ (సి) జేవియర్ (బి) హర్‌ప్రీత్ 8; యశ్ దయాళ్ (ఎల్బీడబ్ల్యూ) (బి) హర్‌ప్రీత్ 0; హాజల్‌వుడ్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 1; మొత్తం (14 ఓవర్లలో 9 వికెట్లకు) 95. వికెట్ల పతనం: 1-4, 2-21, 3-26, 4-32, 5-33, 6-41, 7-42, 8-63, 9-63. బౌలింగ్: అర్‌శ్‌దీప్ 3-0-23-2, జేవియర్ 3-0-26-1, యాన్సెన్ 3-0-10-2, చహల్ 3-0-11-2, హర్‌ప్రీత్ బ్రార్ 2-0-25-2.

పంజాబ్ కింగ్స్ ఇన్నింగ్స్: ప్రియాన్ష్ (సి) డేవిడ్ (బి) హాజల్‌వుడ్ 16; ప్రభ్‌సిమ్రాన్ (సి) డేవిడ్ (బి) భువనేశ్వర్ 13; అయ్యర్ (సి) జితేశ్ (బి) హాజల్‌వుడ్ 7; ఇన్‌గ్లిస్ (సి) సుయశ్ (బి) హాజల్‌వుడ్ 14; నేహల్ (నాటౌట్) 33; శశాంక్ (సి) సాల్ట్ (బి) భువనేశ్వర్ 1; స్టొయినిస్ (నాటౌట్) 7; ఎక్స్‌ట్రాలు 7; మొత్తం (12.1 ఓవర్లలో 5 వికెట్లకు) 98. వికెట్ల పతనం: 1-22, 2-32, 3-52, 4-53, 5-81. బౌలింగ్: భువనేశ్వర్ 3-0-26-2, యశ్ దయాళ్ 2.1-0-18-0, హాజల్‌వుడ్ 3-0-14-3, కృనాల్ 1-0-10-0, సుయశ్ 3-0-25-0.



# నితీశ్‌కు జాక్‌పాట్?..



బీసీసీఐ టీమిండియా వార్షిక సెంట్రల్ కాంట్రాక్ట్ 2025 26ను త్వరలోనే ప్రకటించే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో సెంట్రల్ కాంట్రాక్ట్‌లో ఎవరికి చోటు దక్కుతుందోనన్న ఆసక్తి అందరిలోనూ ఉంది. యువ సంచలనం, ఆంధ్ర ఆల్‌రౌండర్ నితీశ్ రెడ్డి జాక్‌పాట్ కొట్టనున్నట్టు సమాచారం. అతను సెంట్రల్ కాంట్రాక్ట్ రేసులో ఉన్నాడు. గతేడాది నితీశ్ టీమిండియా తరపున అరంగేట్రం చేశాడు. ఇప్పటి వరకు ఐదు టెస్టులు, నాలుగు టీ20లు ఆడాడు.

Also Read సొంతగడ్డపై బెంగళూరు మళ్లీ బోల్తా.. పంజాబ్‌ను గెలిపించిన నేహాల్

బీసీసీఐ స్టాండర్డ్ పాలసీ ప్రకారం.. నిర్దిష్ట వ్యవధిలో మూడు టెస్టులు లేదా 8 వన్డేలు లేదా 10 టీ20లు ఆడితే నేరుగా ప్రొరేటా ఆధారంగా సెంట్రల్ కాంట్రాక్‌ట్‌లో గ్రేడ్ సిలో చోటు దక్కుతుంది. నితీశ్ అవసరమైన టెస్టులు ఆడటంతో అతన్ని గ్రేడ్ సిలోకి తీసుకోనున్నట్టు వార్తలు వస్తున్నాయి. మరో యువ బ్యాటర్ అభిషేక్ శర్మ, యువ పేసర్ హర్షిత్ రాణాలు కూడా సెంట్రల్ కాంట్రాక్‌ట్‌లో చోటు దక్కనున్నట్టు సమాచారం. అభిషేక్ నిర్దిష్ట వ్యవధిలో 12 టీ20లు ఆడాడు. హర్షిత్ సెంట్రల్ కాంట్రాక్ట్ దక్కించుకునేందుకు ఆడాల్సి మ్యాచ్‌లను ఆడినప్పటికీ అతనికి కాంట్రాక్ట్ ఇవ్వాలని బోర్డు భావిస్తున్నట్టు వార్తలు వస్తున్నాయి. వీరు గ్రేడ్ సిలో చేరితో అలవెన్స్‌లతోపాటు వార్షిక వేతనంగా రూ. కోటి పొందుతారు.



# భారత రైజింగ్ స్టార్స్ అనాహత్ సింగ్, ఆకాంక్ష

ప్రపంచ స్క్వాష్ చాంపియన్‌షిప్ ఆసియా క్వాలిఫయింగ్ టోర్నమెంట్‌లో భారత రైజింగ్ స్టార్స్ అనాహత్ సింగ్, ఆకాంక్ష సాలుంఖే సెమీఫైనల్లోకి దూసుకెళ్లారు. శుక్రవారం జరిగిన మహిళల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్స్‌లో ఐదో సీడ్, 17 ఏళ్ల అనాహత్ 11-1, 11-7, 11-5తో అకారి మిదోరికవా (జపాన్)పై, రెండో సీడ్ ఆకాంక్ష 11-0, 11-3, 11-3తో వాయ్ హాన్ యోంగ్ (సింగపూర్)పై గెలుపొందారు.

భారత్‌కే చెందిన తన్వీ ఖన్నా క్వార్టర్ ఫైనల్లో 5-11, 6-11, 12-10, 9-11తో ఎనిమిదో సీడ్ హెలెన్ టాంగ్ (హాంకాంగ్) చేతిలో ఓడిపోయింది. అంతకుముందు తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో అనాహత్ 11-4, 11-5, 11-7తో జెమికా అరిబాడో (ఫిలిప్పీన్స్)పై, ఆకాంక్ష 11-4, 11-3, 11-8తో రిసా సుగిమోటో (జపాన్)పై విజయం సాధించారు. పురుషుల సింగిల్స్ విభాగంలో భారత ప్లేయర్ వీర్ చోత్రాని కూడా సెమీఫైనల్లోకి అడుగు పెట్టాడు. క్వార్టర్ ఫైనల్లో వీర్ చోత్రాని 9-11, 11-6, 11-6, 11-7తో మొహమ్మద్ సిఫిక్ కమాల్ (మలేసియా)పై గెలిచాడు. ఈ టోర్నీలో విజేతగా నిలిచిన ప్లేయర్లు మే 9 నుంచి 17 వరకు చికాగోలో జరిగే ప్రపంచ చాంపియన్‌షిప్ పోటీలకు అర్హత సాధిస్తారు.

# బ్యాటింగ్‌లో పూరన్.. బౌలింగ్‌లో నూర్

ఐపీఎల్ 2025లో భాగంగా ఇవాళ (ఏప్రిల్ 18) ఆర్సీబీ, పంజాబ్ మధ్య మ్యాచ్ జరగాల్సి ఉంది. అయితే ఈ మ్యాచ్ వర్షం కారణంగా రద్దయ్యేలా కనిపిస్తుంది. షెడ్యూల్ ప్రకారం ఈ మ్యాచ్ రాత్రి 7:30 గంటలకు ప్రారంభం కావాల్సి ఉండగా.. 9 గంటలకు వరకు టాస్ కూడా పడలేదు. ఈ మ్యాచ్‌కు వేదిక అయిన బెంగళూరులో ఇంకా వర్షం కురుస్తున్నట్లు సమాచారం. కనీసం 5 ఓవర్ల మ్యాచ్ జరగాలన్నా రాత్రి 10:41 గంటల్లోపు టాస్ పడాలి.

ఇదిలా ఉంటే, ప్రస్తుతం పాయింట్ల పట్టికలో ఢిల్లీ క్యాపిటల్స్ (6 మ్యాచ్‌ల్లో 5 విజయాలు) అగ్రస్థానంలో కొనసాగుతుంది. గుజరాత్ (6 మ్యాచ్‌ల్లో 4 విజయాలు), ఆర్సీబీ (6 మ్యాచ్‌ల్లో 4 విజయాలు), పంజాబ్ (6 మ్యాచ్‌ల్లో 4 విజయాలు), లక్నో (7 మ్యాచ్‌ల్లో 4 విజయాలు), కేకేఆర్ (7 మ్యాచ్‌ల్లో 3 విజయాలు), ముంబై (7 మ్యాచ్‌ల్లో 3 విజయాలు), రాజస్థాన్ రాయల్స్ (7 మ్యాచ్‌ల్లో 2 విజయాలు), ఎస్ఆర్‌హెచ్ (7 మ్యాచ్‌ల్లో 2 విజయాలు), సీఎస్‌కే (7 మ్యాచ్‌ల్లో 2 విజయాలు) ఆతర్వాతి స్థానాల్లో ఉన్నాయి.







# హిమాన్షుకు పసిడి పతకం

ఆసియా అండర్-18 యూత్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో భారత్‌కు తొలి స్వర్ణ పతకం లభించింది. శుక్రవారం జరిగిన పురుషుల జావెలిన్ త్రో ఈవెంట్‌లో హిమాన్షు భారత్‌కు పసిడి పతకాన్ని అందించాడు. 17 ఏళ్ల హిమాన్షు జావెలిన్‌ను 67.57 మీటర్ల దూరం విసిరి విజేతగా నిలిచాడు. లు హావో (చైనా; 63.45 మీటర్లు) రజతం... రుసియన్ సాదుల్లాయెవ్ (ఉజ్బెకిస్తాన్; 61.96 మీటర్లు) కాంస్యం సాధించారు.

హరియాణా మహిళా అథ్లెట్ ఆర్తి తన ఖాతాలో రెండో కాంస్య పతకాన్ని జమ చేసుకుంది. 200 మీటర్ల విభాగంలోనూ ఆర్తి కాంస్య పతకాన్ని సాధించింది. ఆర్తి 24.31 సెకన్లలో గమ్యానికి చేరి మూడో స్థానంలో నిలిచింది. 100 మీటర్ల విభాగంలోనూ ఆర్తి కాంస్య పతకాన్ని కైవసం చేసుకుంది.

మరోవైపు పురుషుల హైజంప్‌లో దేవక్ భూషణ్ రజత పతకాన్ని గెల్చుకున్నాడు. భూషణ్ 2.03 మీటర్ల ఎత్తుకు ఎగిరి రెండో స్థానంలో నిలిచాడు. పురుషుల షాట్‌పుట్‌లో నిశ్చయ్ రజత పతకం దక్కించుకోగా... పురుషుల మెడ్లీ రిలేలో చిరంత్, సయ్యద్ సాబీర్, సాకేత్ మింజ్, కదీర్ ఖాన్‌లతో కూడిన భారత బృందం రజత పతకాన్ని హస్తగతం చేసుకుంది.




## రామాయణ 2 కోసం..


కథానాయకుడు యశ్ నిర్మిస్తున్న బహుభాషా చిత్రాల్లో 'టాక్సిక్'తో పాటు 'రామాయణ' ఉన్న సంగతి తెలిసిందే. నితేశ్ తివారీ రూపొందిస్తున్న ఈ సినిమా రెండు భాగాలుగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇందులో రాముడిగా రణ్‌బీర్ కపూర్, సీతగా సాయిపల్లవి నటిస్తుండగా.. రావణుడి పాత్రను యశ్ పోషిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమా తొలి భాగం చిత్రీకరణ ముగింపు దశకు చేరుకోగా.. ఇప్పుడు రెండో భాగానికి సంబంధించి ఓ ఆసక్తికర విషయం బయటకొచ్చింది. మే నెలాఖరు నుంచి 'రామాయణ: పార్ట్ 2' చిత్రీకరణ మొదలు కానుందని సమాచారం. ఈ షెడ్యూల్‌లో తొలుత సీత పాత్రకు సంబంధించి అశోక వనం ఎపిసోడ్స్ చిత్రీకరించనున్నారని.. జూన్ నుంచి రణ్‌బీర్‌పై రాముడి పాత్రకు సంబంధించిన సన్నివేశాలు తెరకెక్కిస్తారని తెలిసింది. అలాగే వీళ్లిద్దరిపై రెండు పాటల్ని కూడా చిత్రీకరించనున్నట్లు తెలుస్తోంది. ఇక ఈ చిత్ర తొలి భాగం వచ్చే ఏడాది దీపావళికి రానుండగా.. రెండో భాగం 2027 దీపావళికి విడుదల కానుంది.



## భావోద్వేగాలు కట్టిపడేస్తున్నాయి!

''తల్లీకొడుకుల మధ్య అనుబంధం... ఆ నేపథ్యంలో భావోద్వేగాలు ప్రేక్షకుల హృదయాల్ని తాకాయి. సినిమాకి లభిస్తున్న స్పందన ఎంతో సంతృప్తినిచ్చింది'' అన్నారు నందమూరి కల్యాణ్‌రామ్. ఆయన కథానాయకుడిగా నటించిన చిత్రం 'అర్జున్ సన్నాఫ్ వైజయంతి'. విజయశాంతి ముఖ్యభూమిక పోషించారు. ప్రదీప్ చిలుకూరి దర్శకుడు. అశోక్‌వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు నిర్మాతలు. శుక్రవారమే విడుదలైన ఈ సినిమాకి లభిస్తున్న స్పందనపై చిత్రబృందం సంతృప్తి వ్యక్తం చేస్తూ విలేకర్ల సమావేశం నిర్వహించింది. కల్యాణ్‌రామ్ మాట్లాడుతూ ''పొద్దున్నే మా అబ్బాయి సినిమా చూసి...'ఇలాంటి సన్నివేశాల్ని భారతీయ తెరపై ఎప్పుడూ చూడలేదు. గర్వంగా ఉంది నాన్నా' అన్నాడు. ఆ స్పందన నన్ను షాక్‌కి గురిచేసింది. ఈ కథని ప్రదీప్ నా దగ్గరికి తీసుకొచ్చినందుకు, అమ్మ విజయశాంతితో కలిసి నటించినందుకు ఆనందంగా ఉంది. శ్రీకాంత్ పాత్రకి లభిస్తున్న స్పందన చాలా బాగుంది. ప్రతి విభాగం అద్భుతమైన పనితీరుని కనబరిచింది'' అన్నారు. నటుడు శ్రీకాంత్ మాట్లాడుతూ ''కుటుంబమంతా కలిసి చూడదగ్గ ఈ సినిమాకి ప్రారంభ వసూళ్లు చాలా బాగున్నాయి'' అన్నారు. మేం ఎవరికీ చేరువకావాలని అనుకున్నామో ఆ ప్రేక్షకులకి ఈ సినిమా నచ్చిందని చెప్పారు దర్శకుడు. చాలాకాలం తర్వాత థియేటర్లు హౌస్‌ఫుల్‌గా కనిపిస్తున్నాయని చెప్పారు నిర్మాతలు.


## జూన్‌లో తారల మెరుపులు



'లాల్ సింగ్ చద్దా' పరాజయం తర్వాత అగ్రకథానాయకుడు ఆమిర్ ఖాన్ నుంచి వస్తోన్న చిత్రం 'సితారే జమీన్ పర్'. ఆర్.ఎస్.ప్రసన్న దర్శకుడు. జెనీలియా కథానాయిక. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ శరవేగంగా జరుగుతోంది. తాజాగా ఈ సినిమాను జూన్ 20న ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో పాటు వచ్చే నెలలో రాబోతున్న 'రైడ్ 2'తో ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేయాలని నిర్ణయించుకుందట చిత్రబృందం. త్వరలో ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించనున్నట్లు చిత్ర వర్గాలు తెలిపాయి. దర్శీల్ సఫారీ కీలక పాత్ర పోషిస్తున్నారు. విజయవంతమైన 'తారే జమీన్ పర్'కు సీక్వెల్‌గా రూపొందుతున్న చిత్రమిది. డైస్లెక్సియా కారణంగా చదువుకోవడంలో ఇబ్బందులు ఎదుర్కొన్న ఇషాన్ అనే బాలుడి చుట్టూ ఈ సినిమా కథ తిరుగుతుంది.

## నన్ను రాక్షసుడిగా మార్చింది

**"ఈ దొమ్మీలు.. గొడవలు.. రక్తం.. ఏవీ నన్నొద్దనుకోలేదు. పోలేవు కూడా. ఇదే నిజం" అంటున్నారు సూర్య. ఇప్పుడాయన.. పూజా హెగ్డే జంటగా కార్తీక్ సుబ్బరాజ్ తెరకెక్కించిన బహుభాషా చిత్రం 'రెట్రో'. ఇది సితార ఎంటర్‌టెన్‌మెంట్స్ సంస్థ ద్వారా మే 1న తెలుగులో విడుదల కానుంది. ఈ నేపథ్యంలోనే శుక్రవారం చెన్నైలో ఈ చిత్ర ట్రైలర్ విడుదల చేశారు. ఈ సినిమాలో సూర్య గ్యాంగ్‌స్టర్‌గా భిన్న కోణాలున్న పాత్రలో కనిపించారు. ఆయన భార్య పాత్రను పూజ పోషించింది. "ఇన్నేళ్లలో మా జీవితం తనని దాదాపు ఓ బుద్ధుడిలా.. నన్నో రాక్షసుడిగా మార్చేసింది" లాంటి డైలాగ్స్ ట్రైలర్‌లో ఆకర్షణగా నిలిచాయి.**






## క్లూ కనిపెడితే.. వాళ్లతో సినిమా చూస్తా

నవీన్ చంద్ర హీరోగా రాకేశ్ వర్మ తెరకెక్కించిన చిత్రం 'బ్లైండ్ స్పాట్'. రామకృష్ణ వీరపనేని తెరకెక్కించారు. రాశీ సింగ్ కథానాయిక. ఈ సినిమా త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే శుక్రవారం హైదరాబాద్‌లో ఈ చిత్ర ట్రైలర్‌ని విడుదల చేశారు. ఈ సందర్భంగా హీరో నవీన్ చంద్ర మాట్లాడుతూ.. ''ఇదొక మంచి థ్రిల్లర్ సినిమా. ఒక్క రాత్రిలో జరిగే కథగా ఉంటుంది. ఈ స్క్రిప్ట్ వింటున్నప్పుడే చాలా థ్రిల్లింగ్‌గా అనిపించింది. దీంట్లో స్క్రీన్‌ప్లే చాలా కొత్తగా ఉంటుంది. ఈ చిత్ర పోస్టర్‌లో ఓ క్లూ ఉంది. అదేంటన్నది కనిపెట్టి నాకు ఇన్‌స్టాగ్రామ్ వేదికగా మెసేజ్ చేస్తే వాళ్లతో కలిసి నేను సినిమా చూస్తాను'' అన్నారు. ''దీంట్లో నవీన్ చంద్ర అద్భుతంగా నటించారు. రాశి రెండు కోణాలున్న పాత్రలో కనిపిస్తుంది'' అన్నారు దర్శకుడు రాకేశ్ వర్మ. ఈ కార్యక్రమంలో రాశి సింగ్, గాయత్రి భార్గవి, రవి వర్మ తదితరులు పాల్గొన్నారు.

## 'హరి హర వీరమల్లు'లో అదే హైలైట్ కానుంది..



**పవన్ కల్యాణ్ కథానాయకుడిగా రూపొందుతున్న చిత్రం 'హరి హర వీరమల్లు'. క్రిష్, జ్యోతి కృష్ణ దర్శకత్వంలో పీరియాడిక్ యాక్షన్ అడ్వెంచర్‌గా సిద్ధమవుతోంది. తాజాగా ఈ సినిమాపై జ్యోతికృష్ణ ఆసక్తికర విషయాన్ని పంచుకున్నారు. దీంతో ఈ మూవీపై అంచనాలు రెట్టింపు అయ్యాయి. "ఇందులో ఒక యాక్షన్ సీక్వెన్స్‌ను రూపొందించే బాధ్యత పవన్ కల్యాణ్ తీసుకున్నారు. ఈ సినిమాలో మొత్తం ఆరు యాక్షన్ సీక్వెన్స్‌లు ఉన్నాయి. 20 నిమిషాలపాటు ఉండే ఒక దాన్ని పవన్ రూపొందించారు. ఇది ఎంతో ప్రత్యేకమైనది. ఈ సీక్వెన్స్‌లో 1100 మంది పాల్గొన్నారు. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ స్టూడియోలో 61 రోజులు దీన్ని చిత్రీకరించాం. దీని కోసం ఆయన ఎంతో కష్టపడ్డారు. గ్రౌండ్ వర్క్ చేశారు. అంతర్జాతీయ స్టంట్ కొరియోగ్రాఫర్లతో చర్చించారు. సినిమా మొత్తంలో ఇదే హైలైట్ కానుంది" అని తెలిపారు. ఇక ఈ సినిమా కోసం ఆయన ప్రత్యేకంగా గుర్రపు స్వారీలో శిక్షణ తీసుకున్నట్లు జ్యోతికృష్ణ తెలిపారు. ఇందులో పవన్ కల్యాణ్ సరసన నిధి అగర్వాల్ నటిస్తోన్న విషయం తెలిసిందే. ఆమె కూడా ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ ఈ సినిమాలోని ప్రతి అంశంలో పవన్ భాగమయ్యారని తెలిపారు. రెండు పార్ట్‌లుగా తెరకెక్కుతున్న ఈ చిత్రం తొలి భాగం 'హరి హర వీరమల్లు పార్ట్-1 స్వార్డ్ వర్సెస్ స్పిరిట్' పేరుతో మే9న ప్రేక్షకుల ముందుకు రానుంది.**

## 'శుభం' విడుదల ఖరారు

కథానాయిక సమంత సొంత నిర్మాణ సంస్థ ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ నుంచి వస్తున్న చిత్రం 'శుభం'. హర్షిత్ రెడ్డి, గవిరెడ్డి శ్రీనివాస్, చరణ్ పేరి, శ్రియా కొంతం ప్రధాన పాత్రలు పోషించగా, ప్రవీణ్ కండ్రేగుల దర్శకత్వం వహించారు. ఈ చిత్రాన్ని మే 9న విడుదల చేస్తున్నట్లు శుక్రవారం సమంత ప్రకటించారు. హాస్య ప్రధానంగా సాగే ఈ కథ, ప్రేక్షకుల్ని పాత రోజుల్లోకి తీసుకెళుతుందని సినీ వర్గాలు తెలిపాయి. కుటుంబమంతా కలిసి చూసే సినిమా ఇదని పేర్కొన్నాయి. ఈ చిత్రానికి పాటలు: క్లింటన్ సెరెజో, నేపథ్య సంగీతం: వివేక్ సాగర్.





## కలిపింది ఇద్దరినీ..!

సువిక్షిత్ బొజ్జ, గీతిక రతన్ జంటగా తెరకెక్కుతున్న చిత్రం 'దూరదర్శిని'. కలిపింది ఇద్దరిని... అనేది ఉపశీర్షిక. కార్తికేయ కొమ్మి దర్శకుడు. బి.సాయిప్రతాప్ రెడ్డి, జయశంకర్ రెడ్డి నిర్మాతలు. 1990 నేపథ్యంలో ప్రేమకథతో రూపొందుతున్న ఈ చిత్రం ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాల్ని చేసుకుంటోంది. ఇందులోని 'అపనా తనామనా...' అంటూ సాగే పాట లిరికల్ వీడియోని ప్రముఖ దర్శకుడు సుకుమార్ ఇటీవల విడుదల చేశారు. ఆనంద్ గుర్రాన స్వరకల్పనలోని ఈ గీతానికి సురేశ్ బనిశెట్టి సాహిత్యం అందించగా, సింధుజ, శ్రీనివాసన్ ఆలపించారు. పాట విడుదల అనంతరం సుకుమార్ మాట్లాడుతూ ''ఈ సినిమా హీరో సువిక్షిత్ గతంలో పొలంలో వరితో నా చిత్రాన్ని తీర్చిదిద్దాడు. అప్పట్నుంచి తనతో పరిచయం ఉంది. తనకి సినిమా అంటే తపన. మంచి కథని ఎంచుకుని ఈ సినిమాని చేశారు. చిత్రం పెద్ద విజయం సాధించాలని కోరుకుంటున్నా'' అన్నారు. కథానాయకుడు సువిక్షిత్ మాట్లాడుతూ ''నా అభిమాన దర్శకుడు సుకుమార్ చేతులమీదుగా మా సినిమా పాట విడుదల కావడం ఆనందంగా ఉంద''న్నారు. భద్రం, కృష్ణారెడ్డి, కిట్టయ్య, చలపతి రాజు తదితరులు నటించారు.

Printed, Published and Owned by B.PRAMOD KUMAR, B258, Phase1, Vanasthalipuram, Hyderabad70. Printed at Garuda Printers, Plot No.91, Sri Ramnagar Colony, Kharmanghat, Hyderabad500035, Telangana. Published at H.No. B258, Phase1, Vanasthalipuram, Hyderabad500070, Telangana. Editor: N.Ramakrishna Reddy, email: citytimestd@gmail.com, RNI: APTEL/2001/5896